ప్రజాశక్తి

గురువారం 7 సెప్టెంబర్ 2023 8 పేజీలు

ప్రకాశం బాపట్ల

బ్యూటీషియన్ ఇంట్లో చోరీ కేసులో

నలుగురు మహిళలు అరెస్టు

సొత్తు రికవరీ చేసిన తాలూకా పోలీసులు

వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌పి మల్లికగర్గ్

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

నగర పరిధిలోని శ్రీకృష్ణ నగర్‌లో ఓ బ్యూటీషియన్ ఇంట్లో చోరీ చేసి.. బ్యూటీషియన్‌పై దాడికి పాల్పడిన కేసులో నింది తులైన నలుగురు మహిళలను తాలూకా పోలీసులు అరెస్టు చేశా రు. వారి నుంచి రూ.11 లక్షల విలువైన బంగారంతో పాటు కొంత నగదు స్వాధీనం చేసు కున్నారు. ఒంగోలులోని పోలీసు కార్యాలయంలో బుధవారం ఏర్పా టుచేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ మల్లికాగర్గ్ వివరాలు వెల్లడిం చారు. పేర్నమిట్ట సమీపంలో శ్రీకృష్ణనగర్‌లో షేక్ రజియా అనే మహిళ బ్యూటీషియన్‌గా తన ఇంట్లోనే పనిచేస్తున్నారు. భర్త ఉద్యోగం నిమిత్తం ఉదయాన్నే వెళ్లి రాత్రికి ఇంటికి వస్తాడు. కుమార్తె కాలేజీకి వెళుతోంది. ఈ క్రమంలో బాధితురాలికి పరిచయం ఉన్న షేక్ బాను అనే మహిళ తనకు పరిచయం ఉన్న మరో ముగ్గురికి బ్యూటీషియన్ వద్ద బంగారం, డబ్బు ఉందని చెప్పింది. మంగమూరు రోడ్డుకు చెందిన ముండ్రు లక్ష్మీనవత, కరణం మోహన దీప్తితో పాటు మరో మహిళ అపర్ణకు ఈ విషయం చేరవేశారు. ముగ్గురూ కలిసి ఏదోరకంగా బ్యూటీషియన్ వద్ద ఉన్న బంగారం, డబ్బులు కాజేయాలని ప్లాన్ వేశారు. మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో బ్యూటీషియన్ ఇంట్లో ఒక్కరే ఉన్న సమయంలో ముగ్గురు మహిళలు మేకప్ చేయించుకోవాలనే పేరుతో వెళ్లారు. మొదట ఇద్దరు ఐబ్రోస్ చేయించుకున్నారు. తర్వాత మూడో మహిళకు పెడిక్యూర్ చేస్తుండగా.. మిగతా ఇద్దరు మహిళలు ముందుగా అను కున్న పథకం ప్రకారం బ్యూటీషియన్‌పై యాసిడ్ తరహా ద్రావకం చల్లారు. క్లాత్‌ను ఆమె ముఖంపై అద్ది ఆ ద్రావకం ఆమె నోట్లోనూ పోసేందుకు ప్రయత్నం ▶ 2లో

ప్రశ్నార్థకంగా వరి సాగు

- రబీలో మాగాణికి నీరివ్వలేమన్న అధికారులు
- చిరుధాన్యాలు సాగు చేసుకోవాలని సూచన

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

బాపట్ల జిల్లాలో ఖరీఫ్‌లో వరి పంట సాధారణ సాగు విస్తీర్ణం లక్ష హెక్టార్లు కాగా ఈ ఖరీఫ్ సీజన్‌లో 58 వేల హెక్టార్లలోనే రైతులు వరి సాగు చేశారు. రబీలో వరి సాధారణ సాగు విస్తీర్ణం 18,104 హెక్టార్లుగా ఉంది. డ్యాముల్లో నీరు సరిపడా లేనందున ఖరీఫ్‌లో సాగు చేసిన వరి పంటలకు సక్రమంగా నీరందించడం కుదిరేలా లేదు. వారాబందీ పద్ధతిలో సాగు నీరివ్వనున్నారు. వర్షాభావం కారణంగా రబీలో రైతులు వరిసాగు చేయొద్దని, మాగాణికి నీరివ్వలేని, చిరుధాన్యాలు సాగు చేసుకోవాలని అధికారులు చెబుతున్నారు.

కృష్ణా పశ్చిమ డెల్టాలోని కొమ్మమూరు కాలువ పరిధిలో వరి పంట సాగు చేసే మాగా ణి భూములకు రబీలో సాగునీరు ఇవ్వడం వీలుకాదని, అందువల్ల రైతులు వరి పంటకు బదులు చిరుధాన్యాల సాగుకు సిద్ధపడాలని జలవనరుల శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ మేరకు బాపట్ల జిల్లాలో వరిసాగు జరిగే మండలాల పరిధిలో కేబ్స్యాడి, వ్యవసాయా ధికారులు రైతులతో సమావేశాలు జరిపి పం టల సాగు కావలసిన నీటి సరఫరాలో ఉన్న ఇబ్బందులను రైతులకు తెలియజేస్తున్నారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా శ్రీశైలం, సాగార్జునసాగర్ డ్యాముల్లో నీరు అడుగం టడం జరిగింది. సదరు డ్యామ్‌లకు ఎగువ ప్రాంతాల్లో సరిపడినంతగా వర్షాలు పడనం దున ఇప్పట్లో డ్యామ్‌లు నిండే పరిస్థితి లేదు. గత నాలుగు రోజులుగా పర్షాలు పడినప్పటికీ మెట్ట భూముల్లో మిరప, పొగాకు, పత్తి లాంటి పంటల సాగుకు కొంతమేర ఉపయోగం తప్ప మాగాణి సాగు నీరందే పరిస్థితులు లేకుండా పోయాయి. ఈ నేపథ్యంలో బాపట్ల జిల్లాలో రబీలో పంటల సాగు ప్రశ్నార్థకమైంది. బాపట్ల జిల్లాలో రబీలో వరి సాధారణ సాగు విస్తీర్ణం 18,104 హెక్టార్లు కాగా గత రబీలో జిల్లాలో 12 వేల హెక్టార్లలో రైతులు వరిసాగు చేశా రు. జిల్లాలో రబీలో ప్రధానంగా కారం చేడు, చీరాల, వేటపాలెం, చినగంజాం, పర్చూరు, మార్టూరు, బాపట్ల, బల్లికు రవ, అద్దంకి, సంతమాగులూరు మండ లాల్లో వరి పంట సాగు చేస్తారు. ఇప్ప టికే కొమ్మమూరు కాలువ పరిధిలో బాపట్ల, కారంచేడు మండలాల పరిధిలో రైతులు వరిసాగు చేపట్టారు. కొందరు నాట్లు వేయగా, మరి కొందరు నార్లు పోసి ఉన్నారు. అయితే ఆగస్టు నెలలో అసలు వర్షాలు పడక పోవడం డ్యాముల్లో నీరు అడుగంటడంతో కొమ్మమూరు కాలువ పరిధిలో మాగాణి సాగు ప్రశ్నార్థకమైంది. ఏటా కష్ణ పశ్చిమ డెల్టా పరిధిలో 5 లక్షలా 71 వేల ఎకరాలకు సాగునీటిని అందించాల్సి ఉంది. గత జూన్ నాటికి సాగర్ డ్యాములో నీరు బాగానే ఉన్న క్రమంలో జూన్ ఏడో తేదీన కృష్ణా కాలువకు సాగు నీటిని విడుదల చేయడం ▶ 2లో

వ్యక్తిగత దూషణలతో సరి..!

- రాజకీయాల్లో విమర్శలను స్వీకరించలేని స్థితిలో నేతలు.!
- జనం ఎజెండా వదిలేసి వ్యక్తిగత ఆరోపణల్లో నాయకులు
- పార్టీల్లో పెరుగుతున్న అప్రజాస్వామిక పద్ధతులు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

జనం ఎజెండా వదిలేస్తున్నారు. జనం సమస్యలపై పాలక, ప్రతిపక్ష పార్టీల నడుమ చర్చ జరగడం లేదు. విమర్శలన్నీ వ్యక్తిగతంగానే సాగుతున్నాయి. ఒకరిపై ఒకరు ప్రస్తుతం చేసుకునే విమర్శలు రాజకీయాల ప్రస్తుత పరిస్థితులకు అద్దం పడుతున్నాయి. కొద్దిరోజులుగా వైసిపి, తెలుగుదేశం, జనసేన పార్టీల నగర నేతల మధ్య సాగుతున్న విమర్శలు హద్దులు దాటాయి. హుందాతనానికి సవాలుగా మారాయి. రాజకీయాల్లో జరగరానివి కూడా చోటుచేసుకుంటున్నాయి. గతంలో ఎన్నడూ లేని సంస్కృతి తెరపైకి వచ్చింది.

ప్రతిపక్షాలు చేసే విమర్శలను పాలక పక్షం కూడా సక్రమంగా స్వీకరించే పరిస్థితి లేదు. ఎదురుదాడులకు దిగుతున్నారు. అదే సమయంలో ప్రతిపక్షాలు ముఖ్యంగా తెలుగు దేశం, జనసేన పార్టీలు కూడా జనం సమస్యల పేరుతో కేవలం కార్యాలయాల్లో కూర్చొని మీడియాతో మాట్లాడుతున్నారు. ఆరోపణలు చేస్తున్నారు. పోరాటాలు లేవు. ప్రభుత్వంపై కేవలం ఆరోపణలకే పరిమితమవుతున్నారు. బాధిత వర్గాలను సమీకరించి ఆందోళనలు చేపడితే పాలకపక్షం ఎంతో కొంత తలొగ్గు తుంది. అలా జరగడం లేదు. అదే సమయం లో పాలకపక్ష నేతలు కూడా ప్రతిపక్షాల నుంచి వచ్చే సూచనలు స్వీకరించడానికి సిద్ధంగా కనిపించడం లేదు. ప్రతిపక్షాలను శత్రువులు గా భావిస్తున్నారు. వాళ్లు ఏమైనా మాట్లాడితే సహించేది లేదనే ధోరణిని ప్రదర్శిస్తున్నారు. ఈ రెండు ధోరణులూ ప్రమాదంగానే మారా యి. తమ నేత బాలినేనిని విమర్శించే హక్కు మీకు లేదంటూ వైసిపి ద్వితీయశ్రేణి నేతలు.. ఇటు కూడా తమ నాయకుడు జనార్దన్‌పై విమర్శలు చేసే దమ్ము మీకు లేదంటూ తెలుగుదేశం నేతలు మీడియాలో నిత్యం మాట్లాడుతున్నారు. మధ్యలో జనసేన పార్టీ నేతలు కొన్ని సమస్యలపై దృష్టి సారించారు. భూఆక్రమణలపై బాలినేనిపై ఆరోపణలు చేయడం ఇక్కడ సెగలు రేపింది. దీంతో కొందరు వైసిపి ద్వితీయశ్రేణి నేతలు బాలినేనికి అండగా జనసేన నేతలపై ధ్వజమెత్తు తున్నారు. ఈ క్రమంలో కొందరు నేతలు నోటి దురుసు కూడా ప్రదర్శిస్తున్నారు. వ్యక్తిగతంగా ఆరోపణలు చేస్తూ వీడియోలు పెడుతున్నారు. ఇవి సోషల్‌మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. వీటి వల్ల పార్టీల మధ్య ప్రజాస్వామ్యయుత వాతావరణం దెబ్బతింటోంది. నేతల మధ్య కూడా పరిస్థితి ఆందోళనకరంగా మారుతోంది. ఇవే ముదిరితే గొడవలు.. తర్వాత దాడులు.. హత్యలకు దారితీస్తాయనడంలో సందేహం లేదు. నగరంలో వైసిపి, తెలుగుదేశం, జనసేన పార్టీల నడుమ ఇప్పుడు పరిస్థితి సక్రమంగా లేదు. ఎత్తుకు పైఎత్తుల్లో ఉన్నారు. ఎన్నికల్లో గెలుపు కోసం కేంద్రీకరించారు. ఇందుకోసం ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటున్నారు. దీంతో రాజకీయ వాతావరణం బాగా వేడెక్కింది. నగరంలో జరిగే అభివృద్ధితో పాటు అనేక అంశాలపై విమర్శలు, ప్రతి విమర్శలు సాగుతున్నాయి. టిడ్కో ఇళ్లు, రోడ్లపై రోడ్లు, భూ దందాలు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణలు, కొండల ఆక్రమణలు, రేషన్‌దందా, సేవలకు ముడుపులు, నిర్మాణదారుల వద్ద వసూళ్లపై ఇప్పుడు పార్టీల నడుమ రగడ సాగుతోంది. జనం సమస్యలపై చర్చ లేదు. ఆందోళనలు లేవు. జన సమీకరణలు లేవు. వారి పేరుతో వీళ్లు వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారు. ఇప్పుడు ఈ మూడు పార్టీల నేతలు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవడం నిత్యం ఎజెండాగా మారింది.

చంద్రబాబు దొరికిన దొంగ

- ఏ ప్రభుత్వం నోటీసులిస్తుందో తెలియనంత అమాయకుడు కాదు..
- మంత్రి మేరుగ నాగార్జున

ప్రజాశక్తి-భట్టిప్రోలు

అమరావతిలో డొల్ల కంపెనీలతో కోట్లాది రూపాయల అవినీతికి పాల్పడిన చంద్రబాబు నాయుడు దొరికిన దొంగ అని రాష్ట్ర సాంఘిక సం క్షేమ శాఖ మంత్రి మేరు గు నాగార్జున ఆరోపిం చారు. భట్టిప్రోలు మార్కె ట్ యార్డులో బుధవారం ఏర్పాటు చేసిన విలేక రుల సమావేశంలో ▶ 2లో

మంత్రి నాగార్జున

ప్రాణాలు బలిగొన్న లోన్ యాప్.!

- రెండు సంస్థల్లో మృతుడికి రుణాలు ?
- తెల్లవారుజామున ఫోన్ కాల్.. ఆపై యువకుడు ఉరేసుకొని మృతి

ప్రజాశక్తి-పొదిలి

లోన్ యాప్ వేధింపులతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన పొదిలిలో బుధవారం చోటుచేసుకుంది. పొదిలి నగర పంచాయతీ పరిధిలోని పోతవరం గ్రామానికి చెందిన యువకుడు బోనం అశోక్ రెడ్డి (23) తన తండ్రితో కలిసి పొదిలిలో ఐరన్ ఫౌండ్రీ నడుపుతున్నాడు. అశోక్‌రెడ్డి యాక్సిస్ బ్యాంక్, చోళ మండలం ఫైనాన్స్‌లలో ఆధార్, పాన్ కార్డు ఉపయోగించి రుణాలు తీసుకున్నట్లు సమాచారం. ఈ రుణాల చెల్లింపు కోసం గత కొద్ది రోజులుగా సంబంధిత సంస్థల ఏజెంట్లు అశోక్‌రెడ్డిని ఫోన్ ద్వారా వేధింపులు గురిచేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విషయం కుటుంబసభ్యులకి తెలియడంతో వారు అశోక్‌రెడ్డి పట్ల అసంతృప్తిగా ఉన్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో బుధవారం తెల్లవారుజామున మూడు గంటలా 52 నిమిషాలకు మతుడికి ఒక ఫోన్ కాల్ వచ్చింది. సుమారు ఏడు నిమిషాల పాటు మాట్లాడిన మతుడు తరువాత తీవ్ర మనోవేదనకు గురై.. ఇంటిలో ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఫైనాన్స్ సంస్థల రుణ వేధింపుల వల్లే అశోక్‌రెడ్డి ఆత్మహత్య చేసుకున్నట్లు అతని సన్నిహితులు తెలిపారు. ఈ విషయంపై స్పందించేందుకు కుటుంబసభ్యులు నిరాకరించారు.

ప్రశ్నార్థకంగా వరి సాగు

(మొదటిపేజీ తరువాయి)

జరిగింది. ఈ ఏడాది మూడు పంటలకు సాగునీరిస్తామని ఆ రోజున మంత్రి అంబటి రాంబాబు ప్రకటించారు. జూన్‌లో పంట కాలువలకు నీరు విడుదల చేయగా అప్పటికే ఆలస్యంగానే రైతులు పంటల సాగు పనులు చేపట్టారు. ఎక్కువగా మంచినీటి అవసరాల కోసం చెరువులను నింపడం జరిగింది. కానీ జూలై, ఆగస్టు నెలల్లో సరిగ్గా వర్షాలు పడలేదు. వర్షాభావం కారణంగా శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల్లో నీరు పూర్తిగా అడుగంటాయి. కృష్ణా కాలువ, కొమ్మమూరు కాలువ ద్వారా వచ్చిన సాగునీటితో బాపట్ల జిల్లాలోని వేమూరు, రేపల్లె నియోజకవర్గాల పరిధిలో ఖరీఫ్‌లో వరి సాగు చేపట్టారు. బాపట్ల ప్రాంతంలో కొంత మేర వరి సాగు మొదలయింది. పంట కాలువలకు సాగునీరు సక్రమంగా వచ్చే పరిస్థితి లేనందున ఇప్పటికే సాగు చేసిన వరి పంటను రక్షించుకునేందుకు వారాబందీ పద్ధతిలో సాగునీరు అందించే ఏర్పాట్లు అధికారులు చేస్తున్నారు. బాపట్ల జిల్లాలో ఖరీఫ్‌లో వరి పంట సాధారణ సాగు విస్తీర్ణం లక్ష హెక్టార్లు కాగా ఈ ఖరీఫ్ సీజన్‌లో 58 వేల హెక్టార్లలో వరి సాగు చేశారు. పంట కాలువల ద్వారా మాగాణి భూములకు సాగునీరు సక్రమంగా అందే వీలులేకుండా పోయింది. జిల్లాలోని సంతమాగులూరు, బల్లికురవ, అద్దంకి ప్రాంత మాగాణి భూములకు కూడా సాగర్ కాలువ ద్వారా పంటలకు కావలసిన నీరు వచ్చే పరిస్థితి లేదు. రైతులు చిరుధాన్యాల సాగు చేపట్టడం మేలని, ఆరుతడి పంటలు సాగుకు రైతులు పూనుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

అధ్వానంగా ఆర్టీసీ బస్టాండు

ప్రజాశక్తి-సిఎస్ పురంరూరల్

మండల కేంద్రం సిఎస్‌పురంలో ఉన్న ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం అధ్వానంగా ఉంది. దీంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. కొద్దిపాటి వర్షం కురిసినా మురికి నీరు ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో చేరి మురికి కూపంలా మారి దుర్వాసన వెదజల్లుతుంటుంది. దీంతో ప్రయాణికులు ఆర్టీసీ బస్టాండుకు వెళ్లలేని పరిస్థితిలో బస్టాండ్ సెంటర్‌లోని దుకాణాల వద్ద కూర్చుని బస్సుల కోసం నిరీక్షించాల్సి వస్తున్నది. ఈ పరిస్థితి మహిళా ప్రయాణికులకు తీవ్ర ఇబ్బంది కరంగా మారింది. ప్రయాణికులు బస్టాండ్ సెంటర్లోనే ఉంటుండటంతో ఆర్టీసీ బస్సు డ్రైవర్లు సైతం బస్సులను ఆర్టీసీ పాయింట్ వద్దకు తీసుకు వెళ్లకుండా బస్టాండ్ సెంటర్‌లోనే ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు. ప్రయాణికులకు వసతి సౌకర్యాలు కల్పించడంలో ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్య వైఖరిని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆర్టీసీ బస్టాండు ప్రాంగణాన్ని అభివృద్ధి చేసి ఇబ్బందులు తీర్చాలని ప్రయాణికులు కోరుతున్నారు.

శిద్దా సుధీర్‌ను కలిసిన ఆర్యవైశ్యులు

శిద్దా సుధీర్‌ను కలిసిన ఆర్యవైశ్యులు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యులు శిద్దా వీర వెంకట సుధీర్ కుమార్‌ను దర్శి నియోజకవర్గం ముండ్లమూరు మండల ఆర్యవైశ్య నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక లాయర్‌పేటలోని ఆయన నివాసంలో బుధవారం కలిసిన వారు టిటిడి బోర్డు సభ్యులు శిద్దా సుధీర్ కుమార్‌ను అభినందించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ముండ్లమూరు మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పులికొండ శ్రీనివాసరావు, అమరా శ్రీరామమూర్తి, శిఖాకొల్లి సుబ్బారావు, పులికొండ బ్రహ్మేశ్వరరావు,అమరా సురేష్, నరహరి నారాయణ పాల్గొన్నారు.

నలుగురు మహిళలు అరెస్టు

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. చంపుతామని బెదిరించారు. దీంతో బాధితురాలు స్పృహతప్పి పడిపోయారు. అనంతరం ఆమె మెడలో ఉన్న బంగారం గొలుసు, ఆభరణాలు, చెవి కమ్మలు, చేతికి ఉన్న ఉంగరాలు దొంగలించారు. అదే విధంగా బీరువాను తెరిచి అందులో ఉన్న 10 సవర్ల బంగారం ఆభరణాలు, రూ.40 వేలు డబ్బులు తీసుకున్నారు. ముగ్గురూ సొమ్ముతో పరారయ్యారు. వీరిలో ముండ్రు లక్ష్మీనవత, మోహనదీప్తి గతంలో ఇద్దరు యువకులతో కలిసి పెళ్లూరు గ్రామంలో గల అపార్టుమెంటులో కూడా ఇదే తరహాలో నేరం చేసినట్లు పోలీసులు గుర్తించారు. నేరం జరిగిన వెంటనే ఒంగోలు డిఎస్పీ నారాయణస్వామిరెడ్డి పర్యవేక్షణలో తాలూకా సిఐ భక్తవత్సలరెడ్డి, సిబ్బంది వెంటనే గాలింపు చర్యలు చేపట్టారు. సాంకేతికతను వినియోగించి అన్నికోణాల్లో దర్యాప్తు చేసి.. భానుతో పాటు మిగతా ముగ్గురు నిందితులను పట్టుకున్నారు. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న బంగారం విలువ రూ.11 లక్షలు ఉన్నట్లు అంచనా వేశారు. నిందితుల్లో ఇద్దరు మంగమూరు రోడ్డుకు చెందిన మహిళలు. వీరు మద్రిచెట్టు సమీపంలోని అపార్టుమెంట్లలో నివాసం ఉంటున్నారు. ఇలాంటి నేరాలకు పాల్పడటంతో మహిళల్లోనూ ఆందోళన కలిగించింది. మంగమూరు రోడ్డులోనూ, చుట్టుపక్కల ప్రాంతాల్లో ఈ దొంగతనం జనంలో చర్చకు తావిచ్చింది. కేసును వెంటనే ఛేదించిన డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి, తాలూకా సిఐ భక్తవత్సలరెడ్డిని, పోలీసు సిబ్బందిని ఎస్పీ మల్లికాగర్గ్ అభినందించారు.

సిఐ భక్తవత్సలరెడ్డిని అభినందిస్తున్న ఎస్పీ

చంద్రబాబు దొరికిన దొంగ

(మొదటిపేజీ తరువాయి)

ఆయన మాట్లాడారు. చంద్రబాబు నాయుడు తనను నేడో, రేపో అరెస్టు చేస్తారని చెప్పటం సిగ్గుచేటన్నారు. ఎంతో రాజకీయ అనుభవం ఉన్నదని చెప్పుకునే చంద్రబాబునాయుడు చేసిన తప్పుడు పనులకు సంబంధించిన కేసులకు ఎప్పటికప్పుడు ముందుగానే స్టేలు తెచ్చుకుంటూ ప్రజలను మోసం చేస్తున్నాడన్నారు. ప్రస్తుతం అవినీతి కేసుల్లో ఇరుక్కున్న చంద్రబాబు నాయుడుపై కేంద్ర ఐటీ అధికారులు విచారణ చేస్తున్నారని, దీనిని తమ నాయకుడు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పై ఆపదించటం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నోటీసులు ఇస్తుందా లేక కేంద్ర ప్రభుత్వం నోటీసులు ఇస్తుందా అనే విషయం తెలియనంత అమాయకుడేమీ చంద్రబాబు కాదన్నారు. చేసిన తప్పుకు చంద్రబాబు నాయుడు శిక్షార్హుడేనని వ్యాఖ్యానించారు.

చింతల అగ్రహారంలో 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

జాతీయ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని యర్రగొండపాలెం టిడిపి ఇంచార్జి గూడూరి ఎరిక్షన్ బాబు ఆదేశాల మేరకు దోర్నాల మండలంలోని యూనిట్ 41లోని 220, 221బూతులో గల చింతల అగ్రహారం గ్రామంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటి ఇంటికి తిరిగి భవిష్యత్తు గ్యారంటీ చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే మహిళలకు వర్తించే పథకాల గురించి వివరించి బాండ్లు మహిళలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇన్‌ఛార్జీ, ఒంగోలు పార్లమెంటు టిఎన్‌టియూసి ప్రధాన కార్యదర్శి ఈదర మల్లయ్య, గ్రామ పార్టీ అధ్యక్షుడు చిట్యాల వెంకటేశ్వర్‌రెడ్డి, నియోజకవర్గ టిఎన్‌టియూసి ప్రధాన కార్యదర్శి కాశిరావు, బూతు ఇంచార్జీలు చిట్యాల వెంకటనారాయణ రెడ్డి, చల్లా హనుమంతు, నాయకులు చిట్యాల శలమయ్య, చిట్యాల వెంకటేశ్వర్లు, బత్తుల సత్యనారాయణ, బత్తుల వెంకటేశ్వర్లు, చల్లా వెంకటేశ్వర్లు, చల్లా వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు రూ.2లక్షల రిలీఫ్ మంజూరు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలులో గిరిజన యువకులపై పెత్తందారీ దుండగులు హత్యాయత్నం చేసి మూత్రం పోసిన ఘటనలో వారికి రూ.2 లక్షల సాయం మంజూరైంది. ఈ ఘటనలో మంజూరైనా రెండు లక్షల రూపాయల రిలీఫ్ ఆర్డర్ కాపీని బాధితుల ఇంటికి వెళ్లి దళిత నేత నీలం నాగేంద్ర రావు బుధవారం అందించారు.

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S.NO : 103/2023

బోయిల్లపల్లి సురేష్ ..వాది

వర్సస్

యర్రగుంట్ల రవికుమార్ .. ప్రతివాది

To

ప్రతివాది చిరునామా

యర్రగుంట్ల రవి కుమార్ తండ్రి బ్రహ్మం, హిందూ, వయస్సు 38 సంవత్సరాలు, వ్యాపారం, డోర్ నెం 3-7-114, నాయక్ స్ట్రీట్, సూర్య స్కూల్ దగ్గర, గిద్దలూరు పట్టణం, గిద్దలూరు మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబరు దావాలో వాది మీ నుండి పరిహారం రాగోరి పై దావా దాఖలు చేసినందున, సదరు దావాలో నీవు కోర్టుకు హాజరై ఆక్షేపణలు తెలుపుటకు తేదీ 18-09-2023న వాయిదా వుండినది. కావున నీవు వాయిదా రోజున ఉదయం 10-30 నిమిషాలకు నీవు స్వయంగా కానీ, లేదా నీ వకీలు ద్వారా గాని పై కోర్టులో హాజరై నీ ఆక్షేపణలుంటే తెలుపుకునేది, లేనిచో నీ పరోక్షముందు సదరు దావాను విమర్శించి తీర్మానించబడును.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

గిద్దలూరు
తేదీ : 06-09-2023

ఇట్లు
శ్రీ ఎ.తిరుమల ప్రసాద్,
వాది పరం అడ్వకేట్,
గిద్దలూరు, ప్రకాశం జిల్లా.
ఆంధ్ర ప్రదేశ్
సెల్ నెం. 9393442442

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S.NO: 109/2023

బోయిల్లపల్లి సురేష్ ..వాది

వర్సస్

యర్రగుంట్ల వెంకటప్రసాద్ ..ప్రతివాది

To

ప్రతివాది చిరునామా

యర్రగుంట్ల వెంకట ప్రసాద్ తండ్రి బ్రహ్మం, హిందూ, వయస్సు 47 సంవత్సరాలు, వ్యాపారం, డోర్ నెం 3-7-114, నాయక్ స్ట్రీట్, సూర్య స్కూల్ దగ్గర, గిద్దలూరు పట్టణం, గిద్దలూరు మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబరు దావాలో వాది మీ నుండి పరిహారం రాగోరి పై దావా దాఖలు చేసినందున, సదరు దావాలో నీవు కోర్టుకు హాజరై ఆక్షేపణలు తెలుపుటకు తేదీ 08-09-2023న వాయిదా వుండినది. కావున నీవు వాయిదా రోజున ఉదయం 10-30 నిమిషాలకు నీవు స్వయంగా కానీ, లేదా నీ వకీలు ద్వారా గాని పై కోర్టులో హాజరై నీ ఆక్షేపణలుంటే తెలుపుకునేది, లేనిచో నీ పరోక్షముందు సదరు దావాను విమర్శించి తీర్మానించబడును.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

గిద్దలూరు
తేదీ : 06-09-2023

ఇట్లు
శ్రీ ఎ.తిరుమల ప్రసాద్,
వాది పరం అడ్వకేట్,
గిద్దలూరు, ప్రకాశం జిల్లా.
ఆంధ్ర ప్రదేశ్
సెల్ నెం. 9393442442

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.A.NO :161/2023
IN
O.S.NO :103/2023

బోయిల్లపల్లి సురేష్ ..పిటిషనర్/వాది

వర్సస్

యర్రగుంట్ల రవి కుమార్ ..రెస్పాండెంట్/ప్రతివాది

To,

రెస్పాండెంట్ / ప్రతివాది చిరునామా

యర్రగుంట్ల రవి కుమార్ తండ్రి బ్రహ్మం, హిందూ, వయస్సు 38 సంవత్సరాలు, వ్యాపారం, డోర్ నెం 3-7-114, నాయక్ స్ట్రీట్, సూర్య స్కూల్ దగ్గర, గిద్దలూరు పట్టణం, గిద్దలూరు మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబరు దావాలో పిటిషనర్ / వాది మీ నుండి పరిహారం రాగోరి పై నెంబరు పిటిషన్ దాఖలు చేసినందున, సదరు దావాలో నీవు కోర్టుకు హాజరై ఆక్షేపణలు తెలుపుటకు తేదీ 18-09-2023న వాయిదా వుండినది. కావున నీవు వాయిదా రోజున ఉదయం 10-30 నిమిషాలకు నీవు స్వయంగా కానీ, లేదా నీ వకీలు ద్వారా గాని పై కోర్టులో హాజరై నీ ఆక్షేపణలుంటే తెలుపుకునేది, లేనిచో నీ పరోక్షముందు సదరు పిటిషన్‌ను విమర్శించి తీర్మానించబడును.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

గిద్దలూరు
తేదీ : 06-09-2023

ఇట్లు
శ్రీ ఎ.తిరుమల ప్రసాద్,
పిటిషనర్/వాది పరం అడ్వకేట్,
గిద్దలూరు, ప్రకాశం జిల్లా.
ఆంధ్ర ప్రదేశ్
సెల్ నెం. 9393442442

దావా సమను
మహారాజశ్రీ చీరాల సీనియర్ సివిల్ జడ్జ్ వారి కోర్టులో

OS No : 49/2018

Between :

M/s శ్రీ శ్రీనివాస ఏజెన్సీస్, చీరాల,
రిప్రెజెంట్స్ బై ఇట్స్ ప్రొప్రైటరు .
కొల్లా శ్రీరాములు .... వాది

V/s

శ్రీ ప్రసన్న ఆంజనేయ ఏజెన్సీస్ కొణికి.
రిప్రెజెంట్స్ బై ఇట్స్ ప్రొప్రైటరు.
& వగైరాలు ....ప్రతివాదులు.

To,
D5) భవనం రాజశేఖర రెడ్డి.
S/o లేటు నారాయణరెడ్డి.
R/o వంకాయలపాడు గ్రామం,
ఇంకొల్లు మండలం, పర్చూరు D.M.C.,
బాపట్ల జిల్లా.

పై కోర్ట్ నందు వాది ఫైంట్ పరిహారం నిమిత్తం మీ పై దావా దాఖలు చేయగా, సదరు దావా నందు మీ హాజరు నిమిత్తం వాయిదా ది.18-09-2023. కావున మీరు పై కోర్ట్ వారి యెదుట వాయిదా తేదీ.18-09-2023న ఉదయం గం. 10.30 ని.కు స్వయంగా కానీ వకీలు ద్వారా కానీ హాజరు అయీ మీ ఆక్షేపణలు తెలుపు కొనవలెను. లేని యెడల మీ పరోక్షమున వ్యవహారం తీర్మానం చేయబడునని, ఇందుమూలంగా తెలియచేయుటమైనది.

వాయిదా తేదీ : 18-09-2023.
చీరాల తేదీ : 02-09-2023

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

పోతిని సురేంద్ర.
పోతిని వెంకన్న చౌదరి.
వాది తరఫు అడ్వొకేట్స్,చీరాల

IN THE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE: BAPATLA.

S.OP. No.83/2023

Between:-
1. Devara Lakshmi, W/o. Late Srinivasa Rao, Hindu, Aged 41 years, R/o.C/o. Srinivasa Rao, Door No. 14-5-88/30,Vijayalakshmipuram, 31's ward, Bapatla, Guntur District, Cell No. 8106545659.
2. Devara Padma Priya, D/o. Late Srinivasa Rao, Hindu, Aged 23 years, R/o.C/o. Srinivasa Rao Door No. 14-5-88/30, Vijayalakshmipuram, 31 ward, Bapatla, Guntur District. Cell No. 8106545659S ... Petitioners
AND
NIL ... Respondents

ఈ నెంబరు పిటిషన్ లో పిటిషనర్స్ అయిన దేవర లక్ష్మి మరియు దేవర పద్మ ప్రియ అను వారలు లేటు దేవర మేరీ కి సంబంచిన ప్రావిడెంట్ ఫండ్ అమౌంట్ రు. 60,698/-(EE Share) రు. 1,54,561/- (ER Share) మొత్తము కలిపి రు.2,15,259/- (అక్షరాల రెండు లక్షల పదిహేను వేల రెండు వందల యాభై తొమ్మిది) ఎంప్లాయ్ ప్రావిడెంట్ ఫండ్ అథారిటీస్ నుండి విత్ డ్రా చేసుకొనుటకు వారసత్వపు సర్టిఫికేట్ కొరకు పై కోర్టులో SOP.No.83/2023 పిటిషన్ దాఖలు చేసుకొని ఉన్నారు. ఇందు ఎవరి కయినా అభ్యం తరములు ఉన్న యెడల శ్రీ కోర్టు వారి ఎదుట స్వయముగా కానీ, లేదా అడ్వకేట్ గారి ద్వారా కాని ది : 25-09-2023 ఉదయము 10:00 లకు. సదరు శ్రీ కోర్టు వారి ఎదుట హాజరు అయి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకోవలెను లేని యడల పిటిషనర్స్ కి వారు కోరిన విధముగా వారసత్వపు సర్టిఫికేట్ మంజూరు చేయబడును మరియు పరోక్షముగా తీర్మా నించబడును.

వాయిదా తేది: 25-09-2023

వాది తరుపు అడ్వకేటు
తలకాయలు విజయ కుమార్,
అడ్వకేట్, బాపట్ల జిల్లా,
సెల్ నెం. 9290716173.

ఖరీఫ్‌లో పంటలు నష్టపోయిన రైతులకు ..

నష్ట పరిహారం చెల్లించాలి : రైతుసంఘం

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసిన నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని రైతు సంఘం బాపట్ల జిల్లా కార్యదర్శి తల్లపనేని రామారావు డిమాండ్ చేశారు. మండలపరిధిలోని బొల్లాపల్లి గ్రామంలో జిల్లా రైతుసంఘం విస్తత స్థాయి సమావేశం పనక రామాంజనేయులు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ జిల్లా వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు ఖరీఫ్‌లో సకాలంలో సాగు చేయలేక పోయినట్లు తెలిపారు. కొంత మంది రైతులు బోర్ల క్రింద పంటలు సాగు చేసినట్లు తెలిపారు. విద్యుత్ కోతల కారణంగా ఆ పంటలు ఎండిపోయిటనట్లు తెలిపారు. ఫలితంగా రైతులు తీవ్రంగా నష్టపోయినట్లు తెలిపారు. కందిమళ్ల రామకోటేశ్వరరావు మాట్లాడుతూ విద్యుత్ కోతల కారణంగా ఖరీఫ్‌లో పంటలు సాగు చేసిన రైతులకు అప్పులే మిగిలే పరిస్థితి ఏర్పడినట్లు తెలిపారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి ఖరీఫ్‌లో పంట సాగు చేసి నష్ట పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలన్నారు. రబీలో సాగు చేసేవారికి విత్తనాలు, ఎరువులు సబ్సిడీపై అందించాలన్నారు. వ్యవసాయ మోటార్లకు 9 గంటలు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అందించాలన్నారు. కొమ్మమూరు కాలువ పరిధిలోని చివరి భూములకు సాగునీరు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని సమావేశంలో తీర్మానించారు. వర్షాలు తిరిగి మొదలైన కారణంగా రబీ పంట కాలంలో ప్రత్యామ్నాయ పంటలు గురించి వ్యవసాయశాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని రైతు సంఘం నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కాకర్ల వెంకటేశ్వర్లు, బత్తుల హనుమంతరావు, పాలేపు సాంబయ్య, నాగేశ్వరరావు, మల్లారెడ్డి, ఎనికపాటి రాంబాబు, మానం సుబ్బారావు, ఇందుర్తి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

యువతిని మోసం చేసిన ఆర్మీజవాన్‌పై కేసు నమోదు

ప్రజాశక్తి- రాచర్ల

ప్రేమ పేరుతో యువతిని మోసం చేసిన ఆర్మీజవాన్‌పై రాచర్ల పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం... రాచర్ల మండలం అనుమలవీడు గ్రామానికి చెందిన పిన్నిక పవన్‌కుమార్ ఆర్మీలో జవాన్‌గా ఉద్యోగం చేస్తున్నారు. రాచర్ల మండలం సంగపేట గ్రామానికి చెందిన ఓ యువతితో గత కొంతకాలం ప్రేమాయణం సాగిస్తున్నాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మబలికాడు. సెలవులో వచ్చినప్పుడల్లా ఆమెతో చనువుగా ఉండేవాడు. ఈ నేపథ్యంలో ఆ యువతి తన పెళ్లి చేసుకోవాలని కోరింది. దీంతో ముఖం చాటేశాడు. దీంతో బాధి తురాలు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రైమ్ కాలమ్

46 గ్రాముల బంగారం చోరీ

ప్రజాశక్తి -రేపల్లె

గుర్తుతెలియని వ్యక్తులు ఓ ఇంటి తాళాలు పగులకొట్టి లోనికి ప్రవేశించి బీరువాలో దాచిన 46 గ్రాముల బంగారు ఆభరణాలు, 8 తులాల వెండి పట్టాలు అపహరించారు. ఈ ఘటన స్థానిక 15వ వార్డులో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ అబ్దుల్ రజాక్ కథనం ప్రకారం... 15వ వార్డుకు చెందిన చిపిరి వెంకటేశ్వర్లు ఇంటి తాళాన్ని గుర్తుతెలియని వ్యక్తులు పగుల కొట్టారు. అనంతరం లోనికి ప్రవేశించి బీరువా తాళాలు కూడా పగుల కొట్టారు. అందులో దాచిన 46 గ్రాముల బంగారు ఆభరణాలు, 8 తులాల వెండి పట్టాలు తీసుకెళ్లారు. క్లూస్ టీంతో ఘటనా స్థలంలో వేలి ముద్రలు సేకరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

తాగునీరు అందించడంలో ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి బాపట్ల రూరల్

గ్రామీణ తాగునీటి పథకం నిర్వహణలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైనట్లు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యువజన సంఘం కన్వీనర్ గుదె రాజారావు తెలిపారు. బాపట్ల మండలం కంకటపాలెం వెళ్లే రోడ్డులోనున్న 26 ఎకరాల తాగునీటి చెరువు, తాగునీటి ఫిల్టర్ కేంద్రాన్ని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ఓవర్ హెడ్ ట్యాంకులకు నీరు ఫిల్టర్ చేయకుండా పంపింగ్ చేయడం ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు సీజనల్ వ్యాధుల సోకి అనారోగ్యానికి గురవు తున్నారన్నారు. ఎమ్మెల్యే కోన రఘుపతి ప్రధాన అనుచరుడు కాంట్రాక్టర్ తీసుకోవడం వలన అధికారులు నోరు మెదపని పరిస్థితి ఉన్నారన్నారు. ఇప్పటికైనా స్పందించి ప్రజలకు సురక్షిత తాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాలు, బహుజన సమాజ్ పార్టీ నియోజవర్గ ఇన్‌ఛార్జి కొచ్చర్ల వినయ్ రాజు, కెవిపిఎస్ జిల్లా నాయకుడు కె.శరత్ పాల్గొన్నారు.

ఫిల్టర్‌బెడ్ ను పరిశీలిస్తున్న నాయకులు

యువతి కోసం ఘర్షణ

ముగ్గురు యువకులకు గాయాలు

ప్రజాశక్తి-శింగరాయకొండ

యువతి కోసం చోటు చేసుకున్న ఘర్షణలో ముగ్గురు యువకులకు గాయాలయ్యాయి. ఈ ఘటన శింగరాయకొండలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. అందిన వివరాలు ప్రకారం... రైల్వేరోడ్ లోని హోటల్ ఓ యువతి పనిచేస్తుంది. ఆమె కోసం మంగళవారం రాత్రి యువకులు ఘర్షణపడ్డారు. అనంతరం వారు వెళ్లిపోయారు. ఘర్షణ పడిన యువకుల్లోని ఓ యువకుడు బుధవారం మరో యువకుడికి ఫోన్ చేసి ఎక్కడ ఉన్నావని అడిగాడు. మూలగుంటపాడు లోని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు వద్ద ఉన్న జిమ్ములో ఉన్నారని ఆయన యువకుడు చెప్పాడు. ఫోన్ చేసి సమాచారం తెలుసుకున్న యువకుడు సుమారు 30 కలిసి జిమ్ వద్దకు వెళ్లాడు. అనంతరం ఆయువకుడితో ఘర్షణ పడ్డారు. ఘర్షణ గురించి సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలాన్ని వెళ్లి అందరినీ చెదరగొట్టారు. అనంతరం ఘర్షణలో గాయపడిన ముగ్గురు యువకులు పోలీస్‌కు వచ్చి జరిగిన విషయం గురించి వివరం చారు. సిఐ దాచేపల్లి రంగనాథ్ రంగంలోకి ఇరువర్గాలతో వారితో సమావేశమై ఘర్షణకు కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఘర్షణపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇదే సమయంలో కొంత మంది యువకుడు పోలీస్ స్టేషన్ వద్ద గుమిగూడారు. పోలీసులు వారిని అక్కడి నుంచి తరిమి కొట్టారు.

పోటీలో పాల్గొన్న ఎడ్ల జత

ఉత్సాహంగా ఎడ్ల పోటీలు

భట్టిప్రోలు : శ్రీకృష్ణాష్టమి సందర్భంగా అద్దేపల్లి శ్రీ కృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో స్థానిక టిపిఎం రావు ఉన్నత పాఠశాలలో పోలురాధా ఎడ్ల పోటీలు బుధవారం నిర్వహించారు. ఈ పోటీలను ఎస్ఐ అంబటి చంద్రశేఖర్ ప్రారంభించారు. పోటీలు ఉత్సాహంగా సాగాయి. పోటీలను తిలకించేందుకు మండల పరిధి లోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ఈ పోటీల్లో పెద్దపులివారి పంచాయతీ పరిధిలోని గుత్తా వారిపాలెం గ్రామానికి చెందిన కామరాజు గడ్డ బసవయ్య ఎడ్ల జత 2710.7 మీటర్లు లాగి ప్రథమ స్థానంలో నిలిచి రూ. 15, 116 నగదు బహుమతిని కైవసం చేసుకుంది. భట్టిప్రోలుకు చెందిన ఆదిన నాగరాజు ఎడ్ల జత 2611.7 మీటర్లు లాగి ద్వితీయ స్థానం, అద్దేపల్లికి చెందిన డొక్కు సుబ్బారావు ఎడ్ల జత 2607.11 మీటర్ల మీటర్లు లాగి తతీయ స్థానం, సూర్య పల్లికి చెందిన పసుపులేటి కృష్ణ ఎడ్ల జత 2422.7 మీటర్లు లాగి నాల్గవ స్థానం, ఐలవరం అద్దేపల్లికి చెందిన చిట్టి బొమ్మల నాంచారయ్య, గొరిపర్తి భార్గవి ఎడ్ల జత 1800 మీటర్లు లాగి ఐదోస్థానంలో నిలిచాయి. విజేతలకు ద్వితీయ బహు మతిగా రూ. 10116, తతీయ బహుమతికి రూ. 5116, నాల్గవబహుమతిగా రూ. 4116, ఐదో బహుమతిగా రూ.3116 అందజేశారు. పోటీలకు రెఫరీగా కుందేటి శివన్నారాయణ, రమేష్, శ్రీనివాసరావు వ్యవహరించారు

పౌష్టికాహారంతో ఆరోగ్యం : సిడిపిఒ

ప్రజాశక్తి - చీరాల

ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు, గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న పౌష్టికాహారంతో మంచి ఆరోగ్యం లభిస్తుందని సిడిపిఒ సుచరిత తెలిపారు. అందరూ పౌష్టికాహారాన్ని తీసుకొని ఆరోగ్యంగా ఉండాలన్నారు. మండల పరిధిలోని విజయనగర కాలనీలో పౌష్టికాహార మహోత్సవాలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం పౌష్టికాహార మహోత్స వాల్లో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించేందుకు అంగన్వాడీ కార్యకర్తలు చిన్నారులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. తొలుత అంగన్‌వాడీ కేంద్రం లోని పలు రికార్డులను. పరిశీలించారు. అనంతరం ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన 189 నంబర్ అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్త చిట్టెమ్మను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వాణి , అంగన్‌వాడీ సూపర్ వైజర్ సుధ, ఆర్. అరుణకుమారి, అంగన్‌వాడీలు రాజ్యం, డి. అరుణ లక్ష్మి, జి.అరుణ, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్త చిట్టెమ్మను సత్కరిస్తున్న సిడిపిఒ

మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

ప్రమాదవశాత్తూ కాలువలో జారిపడి యువకుడు మృతి

భట్టిప్రోలు : కాళ్ళ, చేతులు కడుక్కునేందుకు కాలువలో దిగి ప్రమాద వశాత్తు అందులో జారీ పడిన ఘటనలో ఓ యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని వెల్లటూరు ఉత్తర సంఘం వద్ద బుధవారం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో చెరుకుపల్లి మండలం పులిగడ్డ వారి పాలెం గ్రామానికి చెందిన బోడపాటి రామ్ పవన్ (21) మృతిచెందాడు. అందిన వివరాల ప్రకారం...రామ్ పవన్ కొల్లూరు మండలం చిన్న పులివర్రు గ్రామంలో లారీకి మొక్కజొన్న బస్తాలు లోడు చేసి తిరిగి వస్తున్నాడు. వెల్లటూరు ఉత్తర సంఘం వద్ద కృష్ణా పశ్చిమ బ్యాంక్ కెనాల్ లో కాళ్ళ, చేతులు కడుక్కునేందుకు కాలువలోకి దిగాడు. ప్రమాద వశాత్తు జారీ పడటంతో నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాడు. సమాచారం తెలుసుకున్న భట్టిప్రోలు పోలీసులు గజ యతగాళ్ల సాయంతో కాలువలో గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాన్ని వెలికి తీశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జగనన్న కాలనీలో సమస్యల దరువు..

- రహదారులు లేక అవస్థలు
- తాగునీటి కోసం తిప్పలు
- పట్టించుకోని అధికారులు

రహదారిపై నిలిచిన నీరు

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

బాపట్ల పట్టణంలోని ప్యాడిసన్‌పేట వద్ద జగనన్న కాలనీ నిర్మించారు. అక్కడ కనీస సౌకర్యాలు లేక పోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వర్షాలు పడినపుడల్లా రహదారులు కాలువలను తలపిస్తున్నాయి. దీంతో ప్రజలు ఇళ్లనుంచి బయటకు రాలేకపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ కాలనీలో రహదారుల నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

జగనన్న కాలనీలో సుమారు 1860 మందికి ఇంటి స్థలాలు మంజూరు చేశారు. 1400 మంది ఇంటి నిర్మాణాలు చేపట్టారు. అవి వివిధ దశల్లో ఉన్నాయి. సుమారు 100 కుటుంబాల వారు ఇక్కడే నివాసం ఉంటున్నారు. కాలనీలో రోడ్లను నిర్మించకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు ప్రతి శనివారం కాలనీ వద్దకు వచ్చి కావాల్సిన సదుపాయాల గురించి లబ్ధిదారులను అడిగి తెలుసుకుంటున్నారు. రోడ్లు నిర్మించాలని స్థానికులు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది. గృహ నిర్మాణ పనుల నిమిత్తం మెటీరియల్ తరలించేందుకు వస్తున్న లారీలు,టిప్పర్లు,ట్రాక్టర్లు రాకపోకలు సాగించేందుకు అవస్థలు తప్పడం లేదు. రహదారులు లేక పోవడంతో వాహనాలు మట్టిలో ఇరుక్కు పోతున్నాయి. రహదారులతో పాటు తాగునీటి సౌకర్యం లేక పోవడంతో ప్రజలు నీటి కోసం కూడా అవస్థలు పడుతున్నారు. రహదారులపై చేరిన నీరు రోజుల తరబడి ముందుకు కదలడం లేదు. దీంతో దుర్గంధం వెదజల్లుతోంది. మురుగునీటిలో సర్పాలు, విషకీటకాలు తిరుగుతున్నాయని కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి జగనన్న కాలనీలో రహదారులు నిర్మించి నీటి సౌకర్యం కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

గడప గడపకూలో మంత్రి నాగార్జున

పేదల సంక్షేమమే ధ్యేయం : మంత్రి

ప్రజాశక్తి-భట్టిప్రోలు

పేదల సంక్షేమమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ధ్యేయమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగు నాగార్జున తెలిపారు. భట్టిప్రోలులోని కొత్తపేట, అద్దేపల్లి మసీదు సెంటర్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి నాగార్జున గడప గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అదేవిధంగా ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి కుటుంబం లబ్ధి పొందేలా ప్రభుత్వం వివిధ పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రవికిరణ్మయి, ఎంపిపి డివి. లలిత కుమారి, జడ్‌పిటిసి తిరువీధుల ఉదయభాస్కరి, ఎంపిటిసిలు గద్దె సుశీల,శాస్త్రి, నాయకులు చెన్నయ్య, మల్లేశ్వరరావు, బాలాజీ, అబ్దుల్ రెహమాన్, ఎంపిడిఒ గుమ్మ చంద్రశేఖర్, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్‌లో అన్నదానం

311వ రోజు అన్నా క్యాంటీన్

ప్రజాశక్తి-బాపట్ల

పేద ప్రజల ఆకలి తీర్చాలన్న సంకల్పంతో టిడిపి బాపట్ల ఇన్‌ఛార్జి వేగేశన నరేంద్ర వర్మ ఆధ్వర్యంలో టిడిపి కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన అన్నా క్యాంటీన్ 311వ రోజుకు చేరింది. బుధవారం నరేంద్ర వర్మ ఆర్థిక సహకారంతో 350 మంది పేదలకు అన్నదానం నిర్వహించారు.

10న ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

గంగవరం ఆరోగ్య సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో ఈనెల 10న బిపి, షుగర్ వ్యాధిగ్రస్తులకు ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు గంగవరం ఆరోగ్య సంక్షేమ వేదిక కన్వీనర్ కరి బాలచంద్రరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని తెలిపారు. శిబిరంలో షుగర్ వైద్య నిపుణులు మంచాల రమేష్‌కుమార్, కంటి వైద్య నిపుణులు డాక్టర్ కె.శ్రీమన్నారాయణ, డాక్టర్ సమత, డాక్టర్ సతీష్ కుమార్, డాక్టర్ .సాంబయ్య వైద్యసేవలు అందిస్తారని తెలిపారు.

ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

చీరాల : శ్రీకృష్ణాష్టమి సందర్భంగా పలు దేవాలయాల్లో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. చీరాల పట్టణంలోని సంతబజారులోనున్న శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవస్థానంలో చుండూరు (ఇనకాల గోత్రం) వారి ఆధ్వర్యంలో మూలవర్లకు నారికేళ పంచామృత సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. పాపరాజు తోటలోని రాధాకృష్ణమందిరంలో రాధాకృష్ణ స్వాములను ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆటయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. పలు చోట్ల చిన్నారులకు కృష్ణుడి వేషధారణ వేసి వారిచేత ఉట్టిని కొట్టించి సందడి చేశారు.

17న టైలర్స్ రాష్ట్ర మహాసభ

వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-బాపట్ల

గుంటూరులో ఈనెల 17న నిర్వహిస్తున్న టైలర్స్ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని రాష్ట్ర టైలర్స్ డెవలప్‌మెంట్ చైర్ పర్సన్ షేక్ సుభాన్‌బి కోరారు. బాపట్ల జిల్లా టైలర్స్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో సన్నాహక సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మహాసభకు సంబంధించిన పోస్టర్‌ను ఆవి ష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గుంటూరు ఏ-1 కన్వెన్షన్ హాలులో నిర్వహిస్తున్న రాష్ట్ర మహాసభలో టైలర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. టైలరింగ్ దుకాణాలకు 200 యూనిట్ల విద్యుత్‌ను ఉచితం ఇవ్వాలన్నారు. 50 సంవత్సరాలు నిండిన టైలర్లకు వద్దాప్య పింఛను మంజూరు చేయాలన్నారు. స్కూల్స్, కార్మికుల యూనిఫాం, ప్రభుత్వ ప్రభుత్వానికి సంబంధించిన కుట్టు పనులు ఆయా ప్రాంతాల్లోని టైలర్లకే ఇవ్వాలన్నారు. రానున్న రోజుల్లో టైలరింగ్ అంతరిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం ప్రోత్సాహకులైన టైలర్లకు శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. టైలర్స్ ఫెడరేషన్‌కు బడ్జెట్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి జిల్లాలో అసోసియేషన్ బిల్డింగ్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టైలర్స్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు విక్కీ నాగేశ్వరరావు కానుగుల, ఎస్‌కె. జానీ, ఎస్‌కె. ముగ్దం బాషా, ఎస్‌కె. నసీబా, వెల్లుల వెంకటేశ్వర్లు , యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు ఎం. భాస్కర్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఉప్పలపాటి మాధవరావు, షేక్ జిలాని, వి.శ్రీనివాసరావు, కె.రవిక ుమార్, శేషగిరిరావు, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.మురళీధర్

ప్రచారం నిర్వహిస్తున్న జెవివి నాయకులు

ప్రజాశక్తి బాపట్ల

బాపట్ల జిల్లా చీరాలలో ఈ నెల 9,10 తేదీల్లో నిర్వహిస్తున్న జన విజ్ఞాన వేదిక 17వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జి. మురళీధర్ పిలుపునిచ్చారు. ప్రచారంలో భాగంగా బాపట్ల, కర్లపాలెం ప్రాంతాల్లో జీపు ప్రచార యాత్ర బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీధర్ మాట్లాడుతూ ప్రజల్లో శాస్త్రీయ ఆలోచన విధానం మరింత పెంచేందుకు జన విజ్ఞాన వేదిక మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొట్ట మొదటిసారిగా చీరాలలో నిర్వహిస్తున్న ఈ మహాసభలకు రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి సుమారు 500 మంది ప్రతినిధులు పాల్గొం టారన్నారు. విద్య వేత్తలు ,శాస్త్రవేత్తలు, పర్యావరణవేత్తలు, సైన్స్ అభిమానులు పాల్గొంటారు. సామాన్య ప్రజలు సైన్స్ ఫలితాలను అందిపుచ్చుకునే విధంగా ఆలోచన పెంపొందించే దిశగా జన విజ్ఞాన వేదిక ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు కోట వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదిక 1998లో విజయవాడలో ఆవిర్భవిం చినట్లు తెలిపారు. మూడున్నర దశాబ్దాలుగా సైన్స్ ఆధారంగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రజలలో బహుముఖ రంగాల్లో చైతన్యం కోసం జెవివి పనిచేస్తుందన్నారు. గతం కంటే జన విజ్ఞాన వేదిక అవసరం నేడు ఎక్కువగా ఉందన్నారు. చీరాలలో నిర్వహిస్తున్న రాష్ట్ర మహా సభలకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞానవేదిక నాయకులు కె. త్రిమూర్తుల రెడ్డి, జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు వై. భాస్కరరావు, పి.రంగారెడ్డి, టి. సుబ్బారావు, ఎస్‌కె. సుభాని, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'యువగళం' వాలంటీర్ల అరెస్టు అప్రజాస్వామికం

అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్

ప్రజాశక్తి-అద్దంకి

లోకేష్ యువగళం పాదయాత్రకు రక్షణ కల్పిస్తున్న వాలంటీర్ల అరెస్ట్ అప్రజాస్వామికమని అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. వైసిపి రౌడీ మూకలే దాడిచేసి వారే వాలంటీర్లపై అక్రమ కేసులు పెట్టించి అరెస్ట్ చేయడం జగన్ సైకోతనానికి నిదర్శనమని విమర్శించారు. పోలీసుల నిర్లక్ష్యం, ఏకపక్ష వైఖరితోనే పాదయాత్రపై వైసిపి మూకలు దాడి చేసినట్లు ఆయన తెలిపారు. యువగళం ప్రజా గళంగా మారడాన్ని జగన్మోహన్ రెడ్డి, వైసిపి సైకోలు ఓర్చుకోలేక దాడులకు పాల్పడుతున్నట్లు తెలిపారు.ప్రశాంతమైన గోదావరి జిల్లాలలో గతంలో ఎన్నడూ లేని విధంగా వైసిపి సైకోలు ఫ్యాక్షనిజం సృష్టిస్తున్నారని తెలిపారు. పోలీసులు ఇచ్చిన రూట్‌లో లోకేష్ పాదయాత్ర చేస్తే అక్కడకు వైసిపి సైకోలకు ఎలా అనుమతించారని ఆయన ప్రశ్నించారు. సిఎం సభలు, సమావేశాలకు టిడిపి జెండాలతో టిడిపి నాయకులు వెళితే పోలీసులు ఊరుకుంటారా అని ప్రశ్నించారు. లోకేష్ పాదయాత్ర మధ్యలోకి వైసిపి జెండాలతో వచ్చి లోకేష్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తుంటే పోలీసులు ఎందుకు మౌనం వహించారని ప్రశ్నించారు. లోకేష్‌పై వైసిపి కార్యకర్తలు రాళ్లు, సీసాలు, కర్రలతో దాడికి దిగితే పోలీసులు ఎందుకు నిరోధించలేదని ఆయన ప్రశ్నించారు. వైసిపి సైకోల దాడిలో ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలకు గాయాలైనట్లు తెలిపారు. దాడికి యత్నించిన వారిని వదిలేసి, ప్రతిఘటించిన వారిని అర్ధరాత్రి అరెస్టు చేసి రోడ్లపై తిప్పారనివిమర్శించారు. పాదయాత్రలో పాల్గొన్న నాయకులపై కేసులు పెట్టడం అప్రజాస్వామికమన్నారు. పోలీసులు టిడిపి కార్యకర్తలను, నాయకులను వేధించడమే తమ వత్తిలా భావిస్తున్నారని తెలిపారు. అధికారం శాశ్వతం కాదని గుర్తు పెట్టుకోవాలని ఆయన హితవు పలికారు.పోలీసులు అరెస్టు చేసిన వారిని తక్షణమే విడుదల చేయాలని ఎమ్మెల్యే రవికుమార్ డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయులకు సన్మానం

ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి - చీరాల

చీరాల పట్టణంలోని రోటరీ కమ్యూనిటీ హాలులో బత్తుల సర్వీస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం గురుపూజోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి చేతుల మీదుగా 15 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి మాట్లాడుతూ సామాజిక స్పృహతో చీరాల ప్రాంతంలో బత్తుల సర్వీస్ ట్రస్ట్ ద్వారా అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఉత్తమ సేవలందించిన గురువులను సత్కరించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు బత్తుల బ్రహ్మారెడ్డి, రాధాకృష్ణ, మురళీకృష్ణ, సత్యనారాయణ, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి 5
గురువారం 7 సెప్టెంబరు 2023

సొంత స్థలంలో ఇల్లు సమకూరేదెన్నడు..?

పక్కా గృహాలు మంజూరు కాక పేదల పాట్లు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

సొంతిల్లు సమకూర్చుకోవడం ప్రతి పేదవాడి కల. ఉన్న కొద్దిపాటి స్థలంలో గూడు కట్టుకుని కల నెరవేర్చుకుందామని చాలా మంది ఎదురుచూస్తున్నారు. అన్ని పత్రాలు సమర్పించి దరఖాస్తు చేసుకుని నెలలు గడుస్తున్నా అనుమతి రాలేదు. సచివాలయాలు, గృహ నిర్మాణశాఖ కార్యాలయాలు చుట్టూ లబ్ధిదారులు ప్రదక్షిణలు చేస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పిఎంఎవై) ద్వారా ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు అందిస్తోంది. ఇవి పూర్తిగా సరిపోకపోయినా కనీసం కొంత మేరకైనా ఆసరాగా ఉంటాయని లబ్ధిదారులు భావిస్తున్నారు. యర్రగొండపాలెం నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో సొంత స్థలాలు ఉన్న వారు గ్రామ, వార్డు సచివా లయాల్లోని ఇంజినీరింగ్ సహాయకులకు సంబంధిత పత్రాలు సమర్పించి దరఖాస్తు చేసుకున్నారు. వీఆర్వోల ద్వారా తహసీల్దారు కార్యాలయానికి వెళ్లి దస్త్రాలు సక్రమంగా ఉన్న వారి వివరాలను గృహ నిర్మాణశాఖకు పంపారు. అక్కడి నుంచి పిఎంఎవై వెబ్‌సైట్‌లో లబ్ధిదారుల పేరిట రిజిస్ట్రేషన్ చేశారు. ప్రభుత్వం నుంచి నిర్మాణాలు మంజూరు చేస్తూ అనుమతి రావాల్సి ఉంది. ఈ ప్రక్రియ మొత్తం సుమారు ఏడాదిన్నరగా సాగుతోంది. యర్రగొండపాలెం నియోజకవర్గంలోని యర్రగొండపాలెం మండలంలో 706, పుల్లలచెరువు మండలంలో 508, త్రిపురాంతకం మండలంలో 630, పెద్దదోర్నాల మండలంలో 480, పెద్దారవీడు మండలంలో 232 వెరసి మొత్తం 2556 మంది లబ్ధిదారులు సొంత స్థలాల్లో ఇంటి నిర్మాణం కోసం ఎదురు చూస్తున్నారు. కొందరు పునాది వరకు నిర్మించుకుని వేచి చూస్తున్నారు.

రుణం మంజూరు కాక బేసమట్టంతో ఆగిపోయిన ఇల్లు

ఎనిమిది నెలలుగా

వేగినాటి కోటయ్య నగర్‌లో రెండు సెంట్లు సొంత స్థలం ఉంది. పక్కా గృహం నిర్మించుకునేందుకు ఆర్థిక స్తోమత సరిపోక గృహ నిర్మాణ శాఖలో దరఖాస్తు చేసుకున్నా. అధికారులు వచ్చి చూసి అన్ని వివరాలు తీసుకున్నారు. దాదాపు ఎనిమిది నెలలుగా అనుమతి కోసం ఎదురుచూ చేస్తున్నా.

తాటి గురవమ్మ, లబ్ధిదారురాలు,
వేగినాటి కోటయ్య నగర్

పక్కా గృహం మంజూరు చేస్తామని చెప్పడంతో

పక్కా గృహం మంజూరు చేస్తామని చెప్పడంతో వారి మాటలు నమ్మి రూ. రెండు లక్షలు అప్పు చేసి బేస్‌మట్టంతో పాటు గోడలు కూడా దాదాపుందరం లెవల్‌కు నిర్మించుకున్నాను. పక్కా గృహం కోసం ఎదురు చూస్తున్నా. ఇప్పటి వరకు మంజూరు కాలేదు. తెచ్చిన అప్పుకు వడ్డీలు పెరిగి పోతున్నాయి.

పాలువాయి శకుంతల,
మిల్లంపల్లి

అనుమతి రావాల్సి ఉంది

సొంత స్థలాల్లో ఇళ్లు కట్టుకోవాలనుకునే వారి దరఖాస్తులు స్వీకరించి లబ్ధిదారుల జాబితా తయారు చేశాం. సదరు వివరాలు ఉన్నతాధికారులకు పంపాం. అనుమతి రావాల్సి ఉంది. వచ్చిన వెంటనే లబ్ధిదారులకు తెలియజేసి పనులు ప్రారంభింపజేస్తాం.

సురేష్, హౌసింగ్ డీఈ,
యర్రగొండపాలెం

ఎస్‌వి బ్రహ్మంను సత్కరిస్తున్న వాసవీ క్లబ్ ప్రతినిధులు

ప్రజాశక్తి బ్యూరో ఎస్‌వి బ్రహ్మంకు ఘన సత్కారం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

వాసవి క్లబ్ వారోత్సవాల్లో పాత్రికేయుల సన్మానంలో భాగంగా సీనియర్ పాత్రికేయులు ప్రజాశక్తి బ్యూరో ఎస్‌వి బ్రహ్మంను క్లబ్ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. జర్నలిజంలో ఆయన చేసిన సేవలను వారు కొనియాడారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ ఒంగోలు విజన్ ప్రెసిడెంట్ లక్ష్మీ వెంకట సత్యనారాయణ జోన్ చైర్మన్ టివి రంగస్వామి, క్లబ్ సభ్యులు సత్యనారాయణ, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్(ఎపిడబ్ల్యుజెఎఫ్) జిల్లా అధ్యక్షులు గొట్టిపాటి నాగేశ్వరరావు, ఒంగోలు ప్రెస్ క్లబ్ వర్కింగ్ ప్రెసిడెంట్ మీసాల శ్రీనివాస్, పి9 మేనేజింగ్ డైరెక్టర్ పోలినేని కిరణ్, ఎడిటర్స్, పబ్లిషర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మేకపాటి మాల్యాద్రి, మై కేబుల్ జర్నలిస్ట్ శ్రీనివాసాచారి పాల్గొన్నారు.

సాహితీ సౌరభం గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

సాహితీ సౌరభం గ్రంథావిష్కరణ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

డిగ్రీ ప్రథమ సంవత్సరం సెమిస్టర్-1 పేరిట ఏర్పాటు చేసిన 'సాహితీ సౌరభం' గ్రంథాన్ని నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షులు డా.నాగభైరవ ఆదినారాయణ స్థానిక ఒంగోలులోని తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పాఠ్య గ్రంథాన్ని రూపకల్పన చేసిన ఆంధ్రోపన్యాసకులు డాక్టర్ నూనె అంకమ్మరావును అభినందించారు. మారిన సిలబస్ ను దృష్టిలో ఉంచుకుని దానికి తగినట్లుగా పాఠ్య గ్రంథానికి మాదిరి ప్రశ్నాపత్రాన్ని, రాదగిన అభ్యాసనాలను తయారుచేయడం ముదావహం అని పేర్కొన్నారు. కార్యక్రమంలో నూకతోటి రవికుమార్, బి.శ్రీరామశర్మ, హరివరం మహేశ్వరాచారి, వి.శేషగిరిరావు, వెంకట్రావు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వివాహ కార్యక్రమాల్లో దామచర్ల సత్య

ప్రజాశక్తి-టంగుటూరు

టంగుటూరు మండలంలోని పలు గ్రామాల్లో జరిగిన వివాహ వేడుకల కార్యక్రమాల్లో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య బుధవారం హాజరయ్యారు.. తౌలుత మండలంలోని తూర్పునాయుడుపాలెం గ్రామంలో గడ్డం వెంకట రాఘవయ్య, షేక్ సిలార్ సాహెబ్ కుమార్తెల వివాహానికి హాజరయ్యారు. టంగుటూరు కొండపి రోడ్డు లోని సివిఆర్ ఫంక్షన్ హాల్‌లో కాకర్లమూడి యోహాను కుమారుడు వివాహ వేడుకకు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం మండలంలోని జమ్ములపాలెం గ్రామంలో కొత్తపల్లి వెంకటేశ్వర్లు (గుణ) కుమారుడు వివాహం సందర్భంగా వరుడు గీత్ చంద్రను దామచర్ల సత్య ఆశీర్వదించారు. అదేవిధంగా నియోజకవర్గంలోని పలు మండలాల్లో జరిగే వివాహ కార్యక్రమాలకు దామచర్ల సత్య హాజరై వధూవరులను ఆశీర్వదించారు. వీరి వెంట తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, టంగుటూరు మాజీ సర్పంచ్ బెల్లం జయంత్ బాబు, జమ్ములపాలెం టిడిపి నాయకులు మక్కెన వెంకట్రావు, పలువురు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.



వివాహ వేడుకల్లో పాల్గొన్న దామచర్ల సత్య

ఎమ్మెల్యేను ఆహ్వానిస్తున్న కమిటీసభ్యులు

కృష్ణాష్టమి జయంతి ఉత్సవాలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

ప్రజాశక్తి - గిద్దలూరు

పట్టణంలోని రాచర్ల గేట్ సెంటర్‌లో వెలసిన శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో జరిగే శ్రీకృష్ణాష్టమి జయంతి ఉత్సవాలకు హాజరు కావాలని స్థానిక శాసన సభ్యులు అన్నా రాంబాబుని ఆలయ కమిటీ సభ్యులు బుధవారం ఆహ్వానించారు. పట్టణంలోని కాశినాయన నగర్‌లోని ఎమ్మెల్యే అన్నా నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానపత్రికను అందచేశారు. ఈ సందర్భంగా 6వ తేదీ నుంచి 8వ తేదీ వరకు ఆలయంలో జరిగే పలు కార్యక్రమాలకు హాజరై స్వామి వారి ఆశీర్వాదాలు తీసుకోవాలని ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఒ. వెంకటయ్య, కటారు రాజా అరుణ్ కుమార్ యాదవ్, మెర్రి పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

ప్రజాశక్తి-దరిశి

శ్రీ కృష్ణుని వేషధారణలో చిన్నారి

దరిశిలోని పొదిలి రోడ్‌లో కృష్ణాష్టమి పర్వదినం సందర్భాన తిండి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో శ్రీకృష్ణుని బొమ్మను ఊరేగింపు చేశారు. అదేవిధంగా చలివేంద్రం కొండ వద్ద గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు పాఠశాలలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. పట్టణంలో చిన్నారుల శ్రీకృష్ణుని వేషధారణలు అలరించాయి.

పది నుంచి సిపిఎం 'పాదయాత్ర'

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ప్రకాశం జిల్లాను వెనుకబడిన జిల్లాగా గుర్తించి జిల్లా అభివృద్ధికి రూ.10 వేల కోట్లను ప్రకటించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు డికెఎం రఫీ డిమాండ్ చేశారు. బుధవారం యర్రగొండపాలెంలోని సిపిఎం పార్టీ కార్యాలయంలో సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 10 నుంచి 23వ తేదీ వరకు 14 రోజులు పాటు 300 కిమీ సిపిఎం పోరుబాట-పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వెనుకబడిన ప్రాంతాలను కలిసి 1970లో ఏర్పాటు చేసిన ప్రకాశం జిల్లా ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా నేటికీ వెనుకబడిన జిల్లాగానే మిగిలిపోయిందన్నారు. 2022లో జరిగిన జిల్లాల పునర్విభజనలో నూతన జిల్లాని ఏర్పాటు చేశారు తప్ప జిల్లా అభివృద్ధికి ప్రణాళిక ప్రకటించలేదన్నారు. గతంలో జరిగిన పోరాటాల ఒత్తిడి మేరకు జిల్లాను వెనుకబడిన జిల్లాగా గుర్తించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ 2018లో జిల్లా పరిషత్ తీర్మానం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. దొనకొండ పారిశ్రామిక కారిడార్, కనిగిరి నిమ్జ్, వాన్‌పిక్‌లో పరిశ్రమలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రకటించిన ఫుడ్ ఆక్వా వెజిటబుల్ ఫ్రూట్ ప్రాసెస్ యూనిట్‌లను ఏర్పాటు చేసి ఉపాధి కల్పించాలని తెలిపారు. వలసలు నివారించాలని చెప్పారు. కొత్తపట్నం హార్బర్‌ను నిర్మించాలన్నారు. ఒంగోలు డైరీని ప్రభుత్వమే నిర్వహించాలని తెలిపారు. సంక్షోభంలో ఉన్న గ్రానైట్, పలకల పరిశ్రమను కాపాడాలన్నారు. వెలుగొండ ప్రాజెక్టు పనులను సత్వరమే పూర్తి చేసి ఈ రబీ సీజన్‌కు నీరందించాలన్నారు. ప్రాజెక్టుకు నికర జలాలు కేటాయించాలని చెప్పారు. నిర్వాసితులను పునరావాస ప్యాకేజీ చెల్లించాలని తెలిపారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు గేట్లు రిపేరు చేసి ఈ సీజన్‌లోనే ప్రారంభించాలన్నారు. ఈ నేపథ్యంలో జరుగుతున్న పోరుబాట-పాదయాత్రలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి టంగుటూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పిఎన్‌సిప కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండలోని పిఎన్‌సిప జూనియర్ కళాశాలలో బుధవారం వెల్‌కమ్ పార్టీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డి.నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్య అతిథిగా పాల్గొని కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎన్ గీతారాణి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత శిఖరాలను చేరుకోవాలని, అందరూ విలువైన భవిష్యత్ కోసం శ్రమించాలని కోరారు. మరొక అతిథి ఐన స్మార్ట్ జన్ గ్లోబల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎంఎస్ఎస్ శాస్త్రి మాట్లాడుతూ ప్రాంతీయ భాషను ప్రేమిస్తూనే ఆంగ్లభాషపై పట్టు సాధించాలని హితవు పలికారు. కళాశాల చైర్మన్ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ మన ఎదుగుదలకు సహకరించే ప్రతిఒక్కరూ గురువులేనని, వారిలో తల్లిదండ్రులు తొలి గురువులు అని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరిని అలరింపజేశాయి. కార్యక్రమంలో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తున్న దృశ్యం

మరమ్మతులకు నోచని ఆర్వో ప్లాంట్

- త్రాగు నీటి కోసం మూడు కిలోమీటర్లు ప్రయాణం
- బొంతవారిపల్లి గ్రామస్తుల అవస్థలు

ప్రజాశక్తి-సిఎస్ పురంరూరల్

మరమ్మతులకు గురైన ఆర్వో ప్లాంట్‌ను బాగు చేయించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో గ్రామస్తులు త్రాగునీటి కోసం అవస్థలు పడుతున్న సంఘటన మండలంలోని బొంతవారిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. బొంతవారిపల్లి గ్రామ ప్రజలకు ఫ్లోరిన్ రహిత త్రాగునీటిని అందించేందుకు 2017 ప్రాంతంలో అప్పటి టిడిపి ప్రభుత్వ పాలనలో రూ.7 లక్షల ఖర్చుతో ఆర్వో ప్లాంట్ నిర్మించారు. అయితే ఆ ఆర్వో ప్లాంట్ మరమ్మతులకు గురి కావడంతో ప్రజలు తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. కొద్ది మంది గ్రామస్తులు దాదాపు మూడు కిలోమీటర్ల దూరం ఉన్న డిజిపేట గ్రామానికి వెళ్లి అక్కడ 20 లీటర్ల నీటిని రూ.10లకు కొనుగోలు చేసి తెచ్చుకొని తాగుతున్నారు. ద్విచక్ర వాహనాలు కలిగిన యువకులు వాహనాలపై నీటిని తెచ్చుకుంటుండగా, వాహన సౌకర్యం లేనివారు కాలినడకన వెళ్లి నీటిని తెచ్చుకుంటూ అవస్థలు పడుతున్నారు. అధిక భాగం గ్రామస్తులు గ్రామానికి సమీపంలో ఉన్న దిగుడు బావి, చేతిపంపుల నీరు తాగుతూ అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆర్వో ప్లాంట్‌ను రిపేరు చేయించి త్రాగునీటి కష్టాలు తప్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయంపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమేష్‌ను ప్రజాశక్తి విలేఖరి వివరణ కోరగా ఆ ఆర్వో ప్లాంట్‌ను పంచాయతీ వారికి అప్పగించామని వారు మరమ్మతులు చేయించుకోవాల్సి ఉందన్నారు.

నిరుపయోగంగా పడి ఉన్న ఆర్వో ప్లాంట్ - మంచినీటి కోసం మూడు కిలోమీటర్లు వెళ్లి తెచ్చుకుంటున్న గ్రామస్తులు

వధువుని ఆశీర్వదిస్తున్న దామచర్ల సత్య

వివాహ వేడుకల్లో దామచర్ల సత్య

ప్రజాశక్తి-కొండపి

కొండపి మండలంలోని కట్టావారిపాలెం గ్రామానికి చెందిన ఆరికట్ల నరసింహం, సుజాతల కుమార్తె పవిత్ర వివాహ వేడుకల్లో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య పాల్గొని వదువుని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట టిడిపి నాయకులు రావెళ్ల చెంచయ్య, బూదవాటి సోమయ్య, నన్నూరి సుబ్బరామయ్య, ఆరికట్ల వెంకటరావు, వంకాయలపాటి తిరుపతయ్య, కూనంనేని రమేష్, ఆరికట్ల సునీల్ తదితరులు పాల్గొన్నారు.

కొండపి వైసిపి నాయకులతో మాదాసి భేటీ

ప్రజాశక్తి-కొండపి

కొండపి మండలంలోని వైసిపి నాయకులను నియోజకవర్గ మాజీ వైసిపి ఇన్‌ఛార్జ్ రాష్ట్రపతి అవార్డు గ్రహీత డాక్టర్ మాదాసి వెంకయ్య మర్యాదపూర్వకంగా కొండపిలోని కామేపల్లి రోడ్డులో వైఎస్ఆర్‌సిపి కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులతో పార్టీ పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమ్మ కార్పోరేషన్ డైరెక్టర్ బొడ్డపాటి అరుణమ్మ, కొండపి మండల సీనియర్ నాయకులు బొక్కిసం సుబ్బారావు, వైస్ ఎంపిపి రావుళపల్లి కోటరాజు, ఆరికట్ల హరినారాయణ, జిల్లా దిశ కమిటి నెంబర్ దుగ్గిరాల వెంకటేశ్వర్లు, మిట్టపాలెం వైస్ సర్పంచ్ మండవ మాలకొండయ్య, చినకండ్లగుంట మాజీ సర్పంచ్ గౌరెడ్డి రమణారెడ్డి, రాయుడు, చోడవరం వెంకటనర్సు, మామిళ్లపల్లి సింగయ్య, కోయవారిపాలెం బొల్లినేని కృష్ణ, వై.వసంత్, సచిన్, మండలంలోని వైసిపి నాయకులు పాల్గొన్నారు.

రోడ్డుపై వరినారు నాటి నిరసన తెలియజేస్తున్న గ్రామస్తులు

రోడ్డుపై వరినారు నాటి నిరసన

ప్రజాశక్తి-త్రిపురాంతకం

త్రిపురాంతకం మండలంలోని ఎండూరివారిపాలెం గ్రామంలో కురిసిన వర్షాలకు రోడ్లు బురధమయంగా మారాయి. నడవాలంటేనే కష్టంగా ఉంటుంది. వాహనదారుల పరిస్థితి మరీ దారుణంగా మారింది. రోడ్ల పరిస్థితిపై నాయకులకు ఎన్నిసార్లు తెలిపినా కనీపం మరమ్మతులు కూడా చేయించ లేదు. దీంతో ఆగ్రహించిన గ్రామస్తులు రోడ్డుపై వరినారు నాటి నిరసన తెలిపారు.

పలు వివాహ వేడుకల్లో బూచేపల్లి

ప్రజాశక్తి-దరిశి

దరిశి మాజీ ఎమ్మెల్యే డాక్టరు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి దరిశిలోని పాటిబండ్ల త్రిపురదాసు (బుజ్జి) కుమార్తె వివాహానికి హాజరయ్యారు. అదేవిధంగా తాళ్ళూరు మండలంలోని తురకపాలెం గ్రామంలో వైసిపి నాయకులు సూరా చినవెంకటరెడ్డి కుమారుడు, ముండ్లమూరు మండలంలోని నాయుడుపాలెం సర్పంచ్ కుమార్తె వివాహాలకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో దరిశి సర్పంచుల సంఘం అధ్యక్షురు రాంభూపాల్‌రెడ్డి, మాజీలు ఎంపిపి ఇత్తడి దేవదానం, పోశం మధుసూధనరెడ్డి, గోళ్లపాటి మోషే, రామిరెడ్డి, వైసిపి నాయకులు చింతలపూడి శ్రీనివాసరెడ్డిలు పాల్గొన్నారు.



వివాహ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి

గ్రామీణ పేదల జీవన విధానం మారాలి

కేంద్ర జలశక్తి అభియాన్ డైరెక్టర్ బప్నా ఐఏఎస్

ప్రజాశక్తి-టంగుటూరు

గ్రామీణ ప్రాంతాలలో నివసించే నిరుపేదల జీవన విధానం ఇంకా మెరుగుపడేలా కృషి చేయాల్సి ఉందని కేంద్ర జలశక్తి అభియాన్ డైరెక్టర్, కేంద్రీయ నోడల్ అధికారి శ్రీరామ్ బప్నా ఐఏఎస్ అన్నారు. బుధవారం మండలంలోని జయవరం, కారుమంచి గ్రామాలలో రైతులకు ఇచ్చిన మామిడి మొక్కలు, రోడ్డు పక్కన నాటిన మొక్కలను పరిశీలించి వాటి సంరక్షణ, తదితర అంశాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన మొక్కల ద్వారా రైతుల ఆర్థిక పరిస్థితి ఏమైనా మెరుగుపడిందా అని స్థానికులను ఆయన అడగగా మామిడి మొక్కల పెంపకం ద్వారా వచ్చే ఆదాయం పేదలకు కొంత ఆసరాగా ఉందని గ్రామస్తులు బదిలిచ్చారు. అదేవిధంగా భూమి పూర్తిగా లేని నిరుపేదలకు ప్రభుత్వం ద్వారా కొంత భూమిని కేటాయించి రైతులు మొక్కలను పెంచుకునే అవకాశాలను పరిశీలించాలని శ్రీరామ్ బప్నా అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర జలశక్తి టెక్నికల్ అధికారి పి యాదయ్య, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కె శీనారెడ్డి, కారుమంచి గ్రామ సర్పంచ్ మన్నం శ్రీనివాస్, వైసీపీ నాయకులు మేదరమెట్ల భరత్ రెడ్డి, ఉపాధి హామీ పథకం టిఏలు, ఎఫ్ఏలు, రైతులు పాల్గొన్నారు.

సంరక్షణపై అధికారులకు సూచనలిస్తున్న మనోజ్ బప్నా ఐఎఎస్

ఖాళీగా దర్శనమిస్తున్న త్రిపురాంతకం బస్టాండ్

నిరుపయోగంగా ఆర్‌టిసి బస్టాండ్

ప్రజాశక్తి-త్రిపురాంతకం

మండల కేంద్రమైన త్రిపురాంతకంలో ఆర్టీసీ బస్టాండ్ నిర్మించి 20 సంవత్సరాలు అవుతుంది. ఇది కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై నిర్మించారు. అంతేకాకుండా బాలత్రిపురసుందరి దేవి, త్రిపురాంతకేశ్వర ఆలయాలతో ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రం. దీనికి నిత్యం వందల కొలది భక్తులు ప్రయాణిస్తూ ఉంటారు. త్రిపురాంతకం కూడా విశాఖపట్నం మొదలుకొని కర్ణాటక రాష్ట్రమైన రాయచూరు వరకు బస్సులు సుమారుగా రోజుకు 70 బస్సులకు పైగా తిరుగుతూ ఉంటాయి. అయితే ఇక్కడ కంట్రోల్ పాయింట్ లేకపోవడంతో బస్సులు బస్టాండ్ లోపలికి రాకుండా రహదారి పైన నిలిపి ప్రయాణికులను ఎక్కించుకుంటారు. బస్టాండ్‌లో ఉన్నటువంటి వ్యాపార సంస్థలను కూడా నిర్వీర్యం చేశారు. ఆర్టిసి అధికారులు స్పందించి బస్టాండ్ లోపలికి బస్సులు వచ్చి పోయే విధంగా చూడాలని ప్రయాణికులు కోరుకుంటున్నారు.

టిడిపిలో 10 కుటుంబాలు చేరిక

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర స్ఫూర్తితో యువత తెలుగుదేశం పార్టీ వైపు ఆకర్షితులవుతున్నారని మాజీ శాసనసభ్యులు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు దామచర్ల జనార్ధన్ రావు పేర్కొన్నారు. బుధవారం 4వ డివిజన్ ఇస్లాంపేట-1 రామన్నపేటకు చెందిన 10 కుటుంబాలు యువకులు నిడమానూరి రమేష్, షేక్ మతిన్‌ల ఆధ్వర్యంలో టిడిపిలో చేరారు. వారిని జనార్ధన్‌రావు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో టిడిపి మైనార్టీ నాయకులు షేక్ సర్దార్ పాల్గొన్నారు.

టిడిపిలో చేరిన యువకులతో దామచర్ల

మదర్ సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

ఉచిత వైద్య శిబిరంలో వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు

ప్రజాశక్తి -కనిగిరి

కనిగిరి పట్టణంలోని శ్రీ వాసవి వద్దుల ఆశ్రమంలో శ్రీ కృష్ణాష్టమి పండుగ సందర్భంగా మదర్ సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలోని వద్దులకు ఒంగోలుకు చెందిన ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ బి.ఎం.వీ.కే కృష్ణ చైతన్య ఆధ్వర్యంలో సాధారణ వైద్య పరీక్షలతో పాటు గుండెకు సంబంధించిన వైద్య పరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులను, పండ్లు, రొట్టెలను పంపిణీ చేశారు. వైద్య శిబిరానికి ముఖ్యఅతిథిగా హాజరైన కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ మదర్ సేవా సమితి ఆధ్వర్యంలో వద్దుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరానికి ప్రముఖ గుండె వైద్య నిపుణులు కృష్ణ చైతన్య ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించడం అభినందనీయమన్నారు. గుండె వైద్య నిపుణులు కృష్ణ చైతన్య మాట్లాడుతూ మదర్ సేవా సమితి ఆధ్వర్యంలో కనిగిరిలో చేస్తున్న సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమని, వారు ఎప్పుడు కోరినా ప్రజలకు ఉచిత వైద్య సహాయం అందించేందుకు సిద్ధంగా ఉంటానన్నారు. కార్యక్రమంలో మదర్ సేవాసమితి అధ్యక్ష కార్యదర్శులు ఎస్ ఎన్ రసూల్ పసుపులేటి అరుణోధర్ కనిగిరి నియోజకవర్గం బీసీ సంక్షేమ సంఘం అధ్యక్ష కార్యదర్శులు షేక్ నాయబ్ రసూల్, ఈర్ల విజయరామరాజు, ఆర్ఎంపి డాక్టర్ ద్రోణాదుల చెంచులు, ఎల్ఐసి నారాయణ, వాసవి వద్దుల ఆశ్రమ నిర్వాహకులు ఎ రంగనాయకులు, మస్తాన్, కేశవ, కనిగిరి ఎబి స్పెషాలిటీ ల్యాబ్ టెక్నీషియన్లు తదితరులు పాల్గొన్నారు

ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాలి

ప్రజాశక్తి-దరిశి

గ్రామాల్లో ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పెంచి పర్యావరణాన్ని రక్షించాలని టిడిపి మాజీ లీగల్‌సెల్ జిల్లా అధ్యక్షులు పరిటాల సురేష్ అన్నారు. మండలంలోని శామంతపూడి గ్రామంలో ఆటోలో మొక్కలు పెట్టుకుని పంపిణి చేశారు. వర్షాలు సక్రమంగా పడాలన్నా, వాతావరణం సమతుల్యంగా ఉండాలన్నా పర్యావరణాన్ని కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామ నాయకులు అమరా నారాయణ, నాగేశ్వరరావు, పోకూరి సుబ్బయ్య, లక్ష్మయ్య, వేణు, మహిళలు పాల్గొన్నారు.

మొక్కలు పంపిణీ చేస్తున్న పరిటాల సురేష్

ఈ- క్రాప్ నమోదు తప్పనిసరి

జిల్లా వ్యవసాయ అధికారి అబ్దుల్ సత్తార్

ప్రజాశక్తి - నగరం

మండల పరిధిలోని బోరామాదిగపల్లి, నగరం గ్రామాల్లో నిర్వహిస్తున్న పంట నమోదు కార్యక్రమాన్ని జిల్లా వ్యవసాయ అధికారి ఎస్‌కె. అబ్దుల్ సత్తార్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో పంటల సాగు చేసిన రైతులు వివరాలను తప్పవని ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు. ఈ క్రాప్ నమోదు చేయించుకున్న రైతులకు ప్రభుత్వం అందించే రాయితీలు వర్తిస్తాయని తెలిపారు. పంట ఉత్పత్తులను అమ్ముకోవాలన్నా ఈ క్రాప్ నమోదు తప్పనిసరి అని తెలిపారు. కౌలు రైతులు సిసిఆర్‌సి ద్వారా పంట నమోదు తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. పిఎం కిసాన్ పథకానికి అర్హులైన ప్రతి రైతుకు ఇకెవైసి చేయించు కోవాలన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.ప్రస్తుతం వరి పంటలో ఆకు చుట్టు పురుగును గుర్తించినట్లు తెలిపారు. దాని నివారణకు గాను క్లోరిపైరిపాస్ 300 ఎంఎల్ లేదా ఏస్ఫేట్ 300 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరానికి పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. ఎఒ రమేష్ బాబు మాట్లాడుతు వ్యవసాయ శాఖ ద్వారా ప్రభుత్వం అందించే ప్రతి పథకం అర్హులైన ప్రతి ఒక్క రైతుకు అందేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించేలా రైతులందరికీ సలహాలు సూచనలు అందజేయాలన్నారు. రైతులు సాగు చేసిన అన్ని పంటలు వివరాలు ఇక్రాప్ నమోదు చేయాలని గ్రామ వ్యవసాయ సహాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి కె.నాగ శ్రీనివాసరావు, ఆయా గ్రామాల గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఈక్రాప్ నమోదును పరిశీలిస్తున్న అబ్దుల్ సత్తార్

రైతులకు మెరుగైన సేవలు అందించాలి : అబ్దుల్ సత్తార్

రేపల్లె : రైతులకు మెరుగైన సేవలు అందించాలని బాపట్ల జిల్లా వ్యవసాయధికారి షేక్ అబ్దుల్ సత్తార్ తెలిపారు. మండల పరిధిలోని అర్బన్ రైతు భరోసా కేంద్రాల్లో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లకు బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్దుల్ సత్తార్ మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాలలో ఎరువులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. గ్రామస్థాయిలోనే వ్యవసాయ అనుబంధ రంగాలకు చెందిన సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. విఎఎలు పంట నమోదు ప్రక్రియ త్వరితగతిన ఈనెల 13లోపు పారదర్శకంగా నిర్వహించాల న్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు ఎరువులను అందించాలని సూచించారు. కౌలు రైతుల కార్డులు ఉన్నవారు 5 గురు సభ్యులుగా ఏర్పడి బ్యాంకులు నుంచి రుణాలు పొందవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో రేపల్లె సబ్ డివిజన్ సహాయవ్యవసాయ సంచాలకులు షేక్ అక్తర్‌హుస్సేన్ స్థానిక ఎఒ వాగోలు బుష్ ఎఇఒ ప్రభాకర్, విఎఎలు తదితరులు పాల్గొన్నారు.

ఆమంచి దంపతుల ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-పర్చూరు

పర్చూరు వై జంక్షన్‌లోని అభయాంజనేయ స్వామి ఆలయంలో వైసిపి పర్చూరు నియోజక వర్గ ఇన్‌ఛార్జి ఆమంచి కష్ణమోహన్ దంపతులు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారి చిన్న కుమారుడు వెంకటేశ్వర్లు హైదరాబాద్‌లో ఐఎఎస్ శిక్షణలో చేర్పించేందుకు వెళ్తూ మార్గమధ్యంలో పర్చూరులో ఆగి అభయాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆమంచి కుటుంబ సభ్యులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోటా హరిప్రసాద్, కోటా శ్రీనివాసరావు, కొల్లా రామకష్ణ, రంగిశెట్టి ఆంజనేయులు, పెదబాబు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పూజలు నిర్వహిస్తున్న కృష్ణమోహన్ దంపతులు

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజశక్తి - చీరాల

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని రామకష్ణాపురం స్పెషల్ ఆఫీసర్ కె. ఉమ తెలిపారు. రామకష్ణాపురంలో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శి కిరణ్ కుమార్‌కు సూచించారు. అనంతరం ప్రతేక పారిశుధ్య పనులు నిర్వపి ంచారు. దోమలు నివారణ చర్యలలో భాగంగా ఫాగింగ్, రోడ్ల వెంబడి బ్లీచింగ్ చల్లించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ దివి జయరాం, పారిశుధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఉమ

రైతులకు భారమైన పశుపోషణ

- వేధిస్తున్న గ్రాసం కొరత
- పెరిగిన దాణా ఖర్చులు
- పడిపోయిన పాలదిగుబడి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో జిల్లా పశ్చిమ మండలాల్లో పశు పోషణ రైతులకు భారమైంది. కాడి వదిలి పాడినే నమ్ముకున్న రైతుల పరిస్థితి గోరుచుట్టుపై రోకలి పోటులా తయారైంది. చిన్న, సన్నకారు రైతులు, పేద ప్రజల ప్రధాన జీవనాధారం పాడి పరిశ్రమే. కరవు పరిస్థితుల్లో మేత, నీరు లభ్యత లేక పశువులు అలమటిస్తున్నాయి. చెరువులు, కుంటల్లో చుక్క నీరు లేకుండా ఇంకిపోయాయి. పాల దిగుబడి నుంచి వచ్చే ఆదాయం గడ్డి, దాణా కొనడానికే చాలని పరిస్థితి ఉంది. ఎండుగడ్డి, దాణా కొనుగోలు చేసి పశువులను పోషించలేక రైతులు సంతల్లో విక్రయిస్తున్నారు. పాడి రైతులను ఆదుకోవడానికి ఉద్దేశించిన కరవు ఉపశమన పథకం ఊసే లేకుండా పోయింది.

నియోజకవర్గంలో పశువులు ఇలా..

నియోజకవర్గంలోని యర్రగొండపాలెం మండలంలో 19,500, పుల్లల చెరువు మండలంలో 18,700, త్రిపురాంతకం మండలంలో 17,900, పెద్దదోర్నాల మండలంలో 15,600, పెద్దారవీడు మండలంలో 15,100 కలిపి మొత్తం 86,800 ఆవులు, గేదెలు ఉన్నాయి.

పాల దిగుబడిపై ప్రభావం..

పశువులకు పచ్చగడ్డి, ఎండుగడ్డి అందించడానికి రైతులు నానా అవస్థలు పడుతున్నారు. సమీకతదాణా లేక పాల దిగుబడి గణనీయంగా తగ్గింది. 10 లీటర్లు పాలు ఇచ్చే ఆవులు సరైన మేత లేక 6 లీటర్లు కూడా ఇవ్వకపోవంతో రైతులు నష్టాలు ఎదుర్కోవాల్సి వస్తోంది. పాలు వట్టిపోయిన ఆవులకు మేత కొనుగోలు చేసి పోషించడం రైతులకు భారంగా మారింది. అప్పుచేసి పశువులను పోషించకలేక పేద ప్రజలు ఆవులను, గేదెలను అమ్ముకుని జీవనాధారాన్ని కోల్పోతున్నారు. ట్రాక్టరు గడ్డి కొనాలంటే రూ.15 వేల నుంచి రూ.17 వేలు వెచ్చించాల్సి వస్తుంది. లారీ గడ్డి కొనుగోలు చేయాలంటే రూ. 45 వేలు అవుతుంది. **ప్రభుత్వ ప్రోత్సాహం కరవు..**

పాడి రైతులను ఆదుకోవడానికి గతంలో ప్రభుత్వం కరవు ఉపశమన పథకం అమలు చేసేది. పాడి రైతుల సంక్షేమం కోసం పాతరగడ్డి, టిఎంఆర్ సమీకతదాణా టన్నుల కొద్దీ సరఫరా చేసింది. ప్రస్తుతం కరువు ఉపశమన పథకం నిలిచిపోయింది.

రాయితీపై టిఎంఆర్ దాణా పంపిణీ

డాక్టర్ ఉడుముల శివారెడ్డి, ప్రభుత్వ పశు వైద్యాధికారి

ప్రభుత్వం పాతరగడ్డికి బదులుగా టిఎంఆర్ దాణా పంపిణీ చేస్తోంది.టిఎంఆర్ దాణా రాయితీ ధరపై కిలో రూ.6.50 చొప్పున అందిస్తున్నాం. రైతులకు అవసరమైనంత టిఎంఆర్ దాణాను సరఫరా చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది.

9న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి-పర్చూరు

ఈనెల 9న పర్చూరు కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి ఎం.సుభవాణి తెలిపారు. అదాలత్‌లో పరిష్కరించ దగ్గ కేసులను పరిష్కరించుకోవచ్చునని తెలిపారు. క్షకిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జడ్జి తెలిపారు. కోర్టులో ఉన్న వాటిలో పరిష్కరిచుకోదగినవి కేసులన్నింటినీ మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవచ్చునని తెలిపారు.

10న ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజశక్తి - చీరాల

చీరాలలోని ఎన్‌విఎస్‌ఎస్‌ఆర్ కళ్యాణ మండపంలో ఎన్‌ఆర్‌ఐ డాక్టర్లు చుండూరి నాగేశ్వరరావు, లలిత దంపతుల సహకారంతో శంకర్ కంటి ఆసుపత్రి, జిల్లా అంథత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 10న మెగా ఉచిత కంటి శిబిరం జరుగుతుందని నిర్వాహకులు శ్రీరామ్ సురేష్ తెలిపారు. వైద్యశిబిరానికి సంబంధించిన కరపత్రాలను బుధవారం ఆవిష్కరించారు. ప్రముఖ వైద్యులచే ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకూ కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కంటి పరీక్షల అనంతరం అవసరమైన వారికి ఉచిత ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. చీరాల, చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మంచి కంటి వెంకటేశ్వర్లు, రత్నాకర్, కష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్తుకు గ్యారెంటీలో నరేంద్ర వర్మ

నరేంద్ర వర్మ ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి బాపట్ల

బాపట్ల పట్టణంలోని 1వ వార్డులో ప్రజా వేదిక, బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి బాపట్ల ఇన్‌ఛార్జి వేగేశన నరేంద్ర వర్మ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. భవిష్యత్తు గ్యారెంటీ సంక్షేమ పథకాల గురించి నరేంద్ర వర్మ వివరించారు. అనంరతం ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ పాలనతో ప్రజలు విసిగిపోయారు. ఎన్నికలు ఎప్పుడూ వచ్చిన వైసిపికి తగిన బుద్ధి చెప్పి టిడిపి విజయం అందించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. వైసిపి పాలనలో అన్ని వర్గాల ప్రజలు సంతోషం లేరని తెలిపారు. నిత్యావరాలు, విద్యుత్ ఛార్జీలు ప్రజలకు భారంగా మారాయని తెలిపారు. పెరిగిన విద్యుత్ ధరలతో పేద, మధ్య తరగతి ప్రజలు నలిగి పోతున్నారని తెలిపారు. నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని తెలిపారు. ఉప్పు, పప్పుల ధరలు పెరగడంతో పేదలకు జీవనం కష్టంగా మారిందన్నారు. ఈ నేపథ్యంలో చంరదబాబు నాయుడు మళ్లీ ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తాత జయప్రకాష్ నారాయణ, టిడిపి పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, సోముల ప్రసాద్, కావూరి శ్రీనివాసరెడ్డి, ఆసోది వెంకటప్ప రెడ్డి, కావూరి చిన శ్రీనివాసరెడ్డి, కావూరి పేద శ్రీనివాసరెడ్డి,ఆసోది శ్రీనివాసరెడ్డి, అక్కల మోహన్ రెడ్డి, తానికొండ దయబాబు, బొడ్డు గోవింద్, సురగాని శేఖర్, ఫరీద్ మస్తాన్, మందపాటి ఆంద్రేయ్య, యలమంద, పరిశా రమేష్ గౌడ్, కుట్టుబోయిన రమేష్,యలవల వెంకటేశ్వర్లు,అంకాల శ్రీను, మస్తాన్ వలి, దారా అశోక్, తాహిర్, సోమయ్య, మహిళా నాయకులు పల్లం సరోజీని, హైమవతి, రాణి, రుక్మిణి, నవనితం, రమాదేవి, రజని తదితరులు పాల్గొన్నారు.

ఇల్లు రాలేదు..డబ్బివ్వలేదు..

- 'డబుల్ బెడ్‌రూమ్' లబ్ధిదారులు చెల్లించిన రూ.25 వేలు ఎప్పుడొస్తాయో?
- వడ్డీ రూపంలో అప్పు రెండింతలు పెరిగిందని ఆందోళన...!

ప్రజాశక్తి-మార్కాపురం

గత టిడిపి ప్రభుత్వ కాలంలో ఆంధ్రప్రదేశ్‌లో పిఎంఎవైతో పాటు ఎన్టీఆర్ గృహకల్పగా నామకరణం జోడించింది. కొంత ఆర్థిక ప్రగతి కలిగిన వారికి బ్యాంకు రుణ సదుపాయాన్ని కూడా అధికారులే లబ్ధిదారులకు కల్పించేలా నిబంధనలు రూపొందించారు. డబుల్ బెడ్ రూమ్ ఇంటి కోసం నాలుగు విడతలుగా రూ.25 వేలు చొప్పున రూ. లక్ష చెల్లించేలా పథకాన్ని రూపొందించారు. ఈ పథకంలో ఎంపికైన లబ్ధిదారులు స్థానిక కార్పొరేషన్ లేదా మున్సిపాలిటీల పేరుతో డిడి రూపంలో చెల్లించాల్సి ఉంది.

మార్కాపురం మున్సిపాలిటీలోనూ డబుల్ బెడ్ రూమ్ ఇంటి కోసం 240 మందిని ఎంపిక చేశారు. వీరందరికీ ప్రభుత్వమే స్థలాన్ని కేటాయించాలి. కట్టుబడికి లబ్ధిదారుని వాటాతో పాటు బ్యాంకు రుణాన్ని కలుపుకుని ఇంటి నిర్మాణం పూర్తి చేసే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే. 2018లో మార్కాపురం మున్సిపాలిటీ పేరుతో మున్సిపాలిటీ పరిధిలోని ఈ పథకంలో అర్హులైన 240 మంది లబ్ధిదారులు తొలి విడతగా రూ.25 వేల చొప్పున డిడిల రూపంలో రూ.60 లక్షలు చెల్లించారు. ఈ పైకం మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వ ఖజానాలో జమ చేశారు. 2019లో ఎన్నికల్లో రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం ఏర్పడింది. ఈ పథకాన్ని మర్చిపోయింది. 240 మంది లబ్ధిదారులకు నేటికీ స్థల ఎంపిక జరగలేదు. డబుల్ బెడ్ రూమ్ ఊసూ లేదు. ఈ విధంగా ఐదేళ్లు గడిచింది. రూ.25 వేలు డిడి చెల్లించిన లబ్ధిదారులంతా డబుల్ బెడ్ రూమ్ ఇల్లు దక్కుతుందన్న ఆశతో అత్యధిక మంది వడ్డీకి తెచ్చి మరీ అప్పట్లో డిడి తీయడం జరిగింది. నగరాల్లో, పట్టణాల్లో వడ్డీ అధికంగా ఉంటుంది. దీంతో డబుల్ బెడ్ రూమ్ ఇంటి కోసం చెల్లించిన రూ.25 వేల ప్రైవేటు అప్పు కాస్తా... రూ. లక్ష దాటింది. డబ్బుకు డబ్బు పోయే... అప్పు పెరిగిపోయే... ఇల్లు లేకపోయే నంటూ లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. డిడి రూపంలో చెల్లించిన పైకం తిరిగి ఎప్పుడు చెల్లిస్తారా అని ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం మాత్రం తిరిగి ఇచ్చే ఆలోచనలో లేనట్లుగా వ్యవహరిస్తోంది. అప్పుచేసి మరీ చెల్లించిన పైకం రాకపోతే ఎలా అంటూ లోలోన మదనపడటం తప్ప చేసేదేమీ లేదని లబ్ధిదారులు వాపోతున్నారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశాల్లోనూ ప్రజా ప్రతినిధులు ఈ అంశంపై చర్చించినా అధికారుల నుంచి సరైన సమాధానం లేకపోవడం ఆశ్చర్యానికి గురి చేస్తోంది.

పైకం తిరిగివ్వాలని నివేదిక పంపాం

మున్సిపల్ కమిషనర్ గిరికుమార్

మార్కాపురం మున్సిపాలిటీలో 240 మంది లబ్ధిదారుల నుంచి ఒక్కొక్కరు రూ.25 వేల చొప్పున రూ.60 లక్షల మేర డిడిలు అందించింది వాస్తవమేనని మున్సిపల్ కమిషనర్ బిఎస్ గిరికుమార్ చెప్పారు. వీరందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇవ్వనందున వారికి తిరిగి పైకం చెల్లించాలని కోరుతూ ప్రభుత్వానికి ఈ పాటికే పలుమార్లు నివేదికలు పంపినట్లు చెప్పారు. ఉన్నతాధికారుల నుంచి ఖచ్చితమైన సమాచారం రాలేదన్నారు.

రైతులను

ముంచుతున్న నకిలీ ఎరువులు

- ఎరువులు, పురుగుమందుల షాపులపై తనిఖీలు శూన్యం - చోద్యం చూస్తున్న వ్యవసాయశాఖ

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

మొక్కల ఎదుగుదల, పూత మంచిగా రావడం కోసం రైతులు తమ పొలాల్లో వినియోగించే ఎరువులకు సంబంధించి నకిలీలను కొందరు యథేచ్ఛగా తయారుచేసి.. వాటిని మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. ఎరు వులు, పురుగుమందుల వ్యాపారంలో ఉన్న వారిలో కొందరు నకిలీ ఎరువులను కుటీర పరిశ్రమల మాదిరిగా గ్రామాల్లో పెట్టుకుని పెద్ద ఎత్తున తయారు చేస్తూ వాటిని అక్రమ మార్గాల్లో విక్రయాలు జరుపుతున్నారు. రైతులను నట్టేట ముంచుతున్నారు. జీవ ఎరువుల తయారీ, కాంప్లెక్స్ ఎరువుల పేరుతో కొందరు నిబంధనలకు విరుద్ధంగా తయారు చేస్తున్నప్పటికీ వ్యవసాయ శాఖ నుంచి పర్యవేక్షణ లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. రైతులు తమ పంటల ఉత్పత్తుల్లో జీవ ఎరువుల వల్ల మేలు జరుగుతుందని భావించి వీటిని ఎక్కువగా వినియోగిస్తున్నారు. ఇదే అదనుగా భావించిన కొందరు వేరువేరు ప్రాంతాల నుంచి కాంప్లెక్స్ ఎరువులు తెచ్చి వాటిని గ్రైండర్‌లో పిండి చేసి.. ఆకర్షణీయమైన రంగులు కలపి.. పేరొందిన కంపెనీల పేరుతో చక్కగా ప్యాంకింగ్ చేసి అమ్మకాలు చేస్తున్నారు.

ఎరువుల షాపుల వారిని నమ్మి తమ పొలాల్లో ఎరువులను వినియోగించే రైతులు రెండు, మూడు రకాల ఎరువులు వాడి నష్టపోతున్నారు. నకిలీ ఎరువులు వాడుతున్నామన్న విషయం తెలియని రైతులు ఎరువుల షాపు వారి మాటలు నమ్మి.. నష్టపోవడం, పంటను కోల్పోవడం జరుగుతుంది. ఆగస్టు నెల 23న బాపట్ల జిల్లా కర్లపాలెం మండలం యాజలి గ్రామంలో 4 రకాల బయో స్టిమ్ లెంట్స్ (జీవ ఉత్పత్తులు) తయారుకు అనుమతి పొంది, అనుమతి లేకుండా మరో 11 రకాల బయో స్టిమ్ లెంట్స్‌ను సదరు సంస్థ వారు కావేరి అగ్రో సైన్సెస్, సనత్‌నగర్, హైదరాబాద్ పేర తప్పుడు చిరునామాతో తయారు చేస్తూ విజిలెన్స్ అధికారుల దాడుల్లో చిక్కారు. ఇక్కడ మొత్తంగా 12 రకాల నకిలీ పురుగుమందుల తయారీ జరుగుతున్నట్లు గుర్తించారు. రూ.32.61 లక్షల విలువ గలిగిన 8,578 కేజీల బయో స్టిములెంట్స్, వాటి తయారీ ఉపయోగించే ముడిసరుకులను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు. అలానే ఆగస్టు 24న జిల్లాలోని చుండూరు మండలం మోదుకూరులో పాత ఇంటిలో ఎలాంటి అనుమతులు లేకుండా తయారు చేస్తున్న నకిలీ జీవ ఉత్పత్తులను తయారు చేస్తుండగా అధికారులు దాడులు చేసి నకిలీ ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ ఎన్ఫోర్సుమెంట్ అధికారులు శుక్రవారం పంగులూరు మండలం ముప్పవరం గ్రామం లోని విజయ దుర్గ ఫాస్ఫాటిక్ ఫర్టిలైజర్ సంస్థపై దాడులు జరిపిన నిబంధనలకు విరుద్ధంగా తయారు చేసి అమ్మకాలు జరుపుతున్న రూ.5 కోట్ల విలువైన నకిలీ ఎరువులు, తయారీ సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు. మార్కెట్లో విరివిగా అమ్ముడుపోతున్న కోరమండల్ ఫర్టిలైజర్ యూరియా ఖాళీ గోతాలల్లో, ఇంపోర్టెడ్ ఫర్టిలైజర్స్ గోతాలను పోలిన నకిలీ బ్యాగులలో నిబంధనలకు విరుద్ధంగా నకిలీ ఎరువుల పౌడర్‌ను నింపి అమ్మకాలు జరుపుతూ చిక్కారు. పెద్ద గోడౌన్‌ను తీసుకున్న ఎరువుల వ్యాపారి కొన్ని ఇంపోర్టెడ్ ఫెర్టిలైజర్స్‌ను యంత్రాలను ఉపయోగించి పౌడర్‌గా మార్చి వాటికి వివిధ రకాల రంగులు జోడించి ప్యాకింగ్ చేసి వివిధ ప్రాంతాలకు పంపుతు రైతులను భారీగా మోసగిస్తున్నట్లు ఈ దాడుల్లో తేలింది. అధికారులు నిరంతర పర్యవేక్షణతో నకిలీలకు అడ్డుకట్ట వేయాల్సి ఉంది.

యాజలిలో విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్న నకిలీ బయో ఉత్పత్తులు (ఫైల్)

మంత్రి సురేష్ వ్యాఖ్యలను ఖండిస్తున్నాం..

ఫ్యాప్టో నేతలు

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

గురువుల కన్నా గూగుల్ మిన్న అని, గురువుల దగ్గర కన్నా, గూగుల్‌లో ఎక్కువ మెటీరియల్ దొరుకుతుందని మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను ఫ్యాప్టో నాయకులు బుధవారం ఒక ప్రకటనలో ఖండించారు. టీచర్స్ డే సందర్భంగా ఒంగోలులో జరిగిన సభలో ఈ వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం రాష్ట్రంలోని లక్షలాది మంది టీచర్స్‌ను అవమానించడమేనని చెప్పారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి, గురుపూజోత్సవం సందర్భంగా గురువుల సన్మాన కార్యక్రమంలో ఇలాంటి వ్యాఖ్యలు చేయడాన్ని బట్టి చూస్తే టీచర్లపై ప్రభుత్వానికి ఎంత గౌరవం ఉందో తెలుస్తోందన్నారు. స్వయంగా స్కూల్స్, కాలేజీలు నడుపుతున్న మంత్రి సురేష్, టీచర్స్‌ను అగౌరపరచడం దారుణమన్నారు. గూగుల్‌లో స్టూడెంట్స్‌కు సంబంధించి, స్టడీ మెటీరియల్ పోస్ట్ చేసేది కూడా టీచర్స్ అని మంత్రి సురేష్ మర్చిపోయినట్లున్నారని విమర్శించారు. ఐదో తేదీ వచ్చినప్పటికీ టీచర్స్‌కు జీతాలు చెల్లించలేని ప్రభుత్వం సిగ్గు పడాల్సింది పోయి, టీచర్స్ డే రోజు వారిని అవమానించడం విచారకరమన్నారు. ఉపాధ్యాయుల మనోభావాలు దెబ్బతినే విధంగా మాట్లాడిన మంత్రి సురేష్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని.. క్షమాపణ చెప్పాలన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్యం..

ఉపాస్ హాస్పిటల్ వైద్యులు జోత్స్న

ప్రజాశక్తి-టంగుటూరు

వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్యం సాధ్యమని ఒంగోలు ఉపాస్ హాస్పిటల్ వైద్యులు జ్యోత్స్న పేర్కొన్నారు. బుధవారం స్థానిక పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో రుతుక్రమ పరిశుభ్రతపై అపోహలు, వాస్తవాలు అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డాక్టర్ జోత్స్న మాట్లాడుతూ కళాశాల విద్యార్థినులు వ్యక్తిగతంగా ఎదుర్కొనే సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కార మార్గాలను వారికి వివరించారు. కళాశాల హెల్త్ వాచ్ కమిటీ కన్వీనర్ పి బ్రహ్మం, నర్సింగ్ సిబ్బంది పి.ఇందిర ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపల్ జీవీకే మూర్తి, స్టూడెంట్స్ అఫైర్స్ డీన్ ఆర్.వీరాంజనేయులు, ట్రైనింగ్, ప్లేస్‌మెంట్స్ డీన్ కె.రూప ఆకాష్, మహిళా విభాగం కన్వీనర్ ఎన్ వైష్ణవి పాల్గొన్నారు.

డాక్టర్ జోత్స్నను సత్కరిస్తున్న కళాశాల సిబ్బంది

పేదలకు పప్పుచారూ కరువే.!

నాలుగు నెలలుగా రేషన్‌లో కందిపప్పు దూరం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

మార్కెట్‌లో నిత్యావసర ధరలు మండిపోతున్నా.. పేద, మధ్యతరగతి ప్రజలకు ఉపశమనం కలిగించే చర్యలు ప్రభుత్వం తీసుకోవడం లేదు. తెల్లకార్డుదారులకు రాయితీపై అందించే కందిపప్పు గత నాలుగు నెలలుగా పూర్తిగా నిలిచిపోయింది. పంచదార సైతం చాలా చోట్ల సక్రమంగా పంపిణీ కావడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా కందిపప్పు సరఫరా నిలిచిపోయినట్లు అధికారులు చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో సామన్యులు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు.

సెప్టెంబర్‌కు సంబంధించి కందిపప్పు సరఫరా నేటికీ సరఫరా కాలేదు. రాయితీపై నాలుగు నెలల సరకు అందుతుందని కార్డుదారులు ఎదురుచూశారు. కానీ సెప్టెంబర్ ఒకటి నుంచి పేదలకు అందించే రేషన్ సరకుల్లో కందిపప్పు లేదని అధికారులే చెబుతున్నారు. దీంతో పేదలు పప్పు బువ్వకు కూడా నోచుకోక పచ్చళ్లతో కాలం గడపాల్సి వస్తుందని కంటనీరు పెడుతున్నారు. అసలే కూరగాయలు, నిత్యావసరాల ధరలు ఆకాశానంటుతున్నాయి. పేద, మధ్య తరగతి ప్రజలు జీవనం సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం రాయితీపై అందించే సరకుల కోసం ఆశతో ఎదురుచూస్తున్న లబ్ధిదారులకు నిరాశే మిగులుతోంది. దీనికి తోడు ప్రభుత్వం పేదలకు అందాల్సిన సరకుల్లో ఒక్కొక్కటిగా తగ్గిస్తోంది. నాలుగు నెలలుగా కందిపప్పు పంపిణీ చేయలేదు. ఈనెలలో కూడా కందిపప్పు ఇవ్వడం లేదు. కార్డుదారులకు బియ్యం, పంచదార మాత్రమే పంపిణీ చేస్తున్నారు.

ప్రకాశం జిల్లావ్యాప్తంగా 385 ఎండీయూ వాహనాలుండగా వీటి పరిధిలో 6,58,825 (కొత్త కార్డులతో కలిపి) బియ్యం కార్డులున్నాయి. ఆయా కుటుంబాలకు ప్రతినెలా బియ్యంతో పాటు అర కిలో పంచదార, కిలో కందిపప్పును ప్రభుత్వం రాయితీపై అందిస్తోంది. ప్రతి నెలా జిల్లాకు 658 మెట్రిక్ టన్నుల కందిపప్పు పంపిణీ చేయాల్సి ఉంది. రాయితీపై ప్రతి కార్డుకు రూ.67 చొప్పున అందించేది. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో దీని ధర రూ.160 నుంచి రూ.180 వరకు ఉంది. వరుసగా నాలుగు నెలల నుంచి కందిపప్పు సరఫరా లేకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పప్పును మరిచిపోయాం..

అల్లూరి వెంకటేశ్వర్లు, యర్రగొండపాలెం

గతంలో ప్రతినెలా కందిపప్పు పంపిణీ చేసేవారు. దీంతో వారంలో రెండు రోజులైనా పప్పుచారు చేసుకునేటోళ్లం. తీరా నాలుగు నెలల నుంచి కందిపప్పు పంపిణీ చేయడమే ప్రభుత్వం నిలిపివేసింది. దీంతో పప్పుచారు చేసుకోవడమే మానుకున్నాం.

బయట కొనలేకపోతున్నాం..

కాటిపల్లి దానియేలు, రాచకొండ

రేషన్ షాపుల్లో రూ.67కు కేజీ కందిపప్పు సరఫరా చేసేవాళ్లు. ప్రస్తుతం సరఫరా నిలిపివేయడంతో కందిపప్పు ధర బయట మార్కెట్‌లో రూ.160 నుంచి రూ.180 వరకు పలుకుతోంది. అసలే పనులు లేక ఇబ్బందులు పడుతున్న పేదలు అంత ధర పెట్టి కందిపప్పు కొనుగోలు చేయడం కష్టంగా మారుతోంది.

ప్రభుత్వం నుంచి వస్తే పంపిణీ చేస్తాం

అన్నపురెడ్డి తిరుపతిరెడ్డి, గోడౌన్ డీటీ, యర్రగొండపాలెం

ప్రభుత్వం నుంచి కందిపప్పు సరఫరా లేదు. వస్తే కార్డుదారులకు పంపిణీ చేస్తాం. ప్రస్తుతానికి అంగన్‌వాడీ కేంద్రాలకు మాత్రమే సరఫరా వచ్చింది. బియ్యంతో పాటు, పంచదార పంపిణీ చేస్తున్నాం. ప్రభుత్వం నుంచి కందిపప్పు సరఫరా వచ్చిన వెంటనే లబ్ధిదారులకు అందిస్తాం.